RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 11 సెప్టెంబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:90

## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

# సీఎం రేవంత్

**కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**
**అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ**
**అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య**
**ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు**
**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**



ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు.

ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

## పేదల ఆత్మగౌరవమే

# ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం దేశంలో ఎక్కడా లేదు..**
**తెలంగాణలోనే అమలు**
**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు**
**ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు**
**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ**



వార్తా 2 లో

## ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సౌర, ఫ్లోటింగ్ సోలార్, ఇతర సంప్రదాయేతర ఇంధన వనరులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుపై విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. దీనిపై త్వరలో స్పష్టమైన ప్రకటన చేస్తామని ఆయన చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సోదాహరణంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, కొమురంభీం, పాలేరు, వైరా, మల్లన్నసాగర్, ఎల్ఎండీ, మిడ్‌మానేరు, పోచారం వంటి జలాశయాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

అదనపు వ్యయమే ప్రధాన సవాల్:

సాధారణ సోలార్ ప్రాజెక్టులతో పోలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటుకు అధిక వ్యయం అవుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద మెగావాట్‌కు రూ.కోటి వరకు సహాయం అందించే పథకాన్ని ప్రకటించినప్పటికీ అందులో కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పారు. ప్రధానంగా దేశీయంగా తయారైన పరికరాలనే ఉపయోగించాలనే కేంద్ర నిబంధనల కారణంగా మెగావాట్‌కు సుమారు రూ. 1.30 కోట్ల వరకు అదనపు భారం పడుతోందని వివరించారు. కేంద్రం విధించిన నిబంధనలను సడలిస్తే ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులపై పెట్టుబడిదారుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని ఆయన శాసనసభకు చెప్పారు.

మిగతా 3 లో

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

# డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

**ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు**
**ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ**
**పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు**
**ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు**
**ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ**



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.

పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు.

ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## ఢిల్లీ చేరుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు



ఢిల్లీ చేరుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి,కోవా లక్ష్మీ, మాజి మంత్రులు సత్యవతి రాథోడ్, జగదీష్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి శుక్రవారంనాడు జాతీయ మహిళ కమిషన్ చైర్ పర్సన్, జాతీయ మానవహక్కుల కమిషన్ ను కలిసి అసెంబ్లీ ఆవరణ లో మహిళ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై పిర్యాదు చేయనున్న నేతలు



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని ఆహ్వానించింది. అసెంబ్లీలోని ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ని దేవాదాయ శాఖ కమిషనర్ , శ్రీ గణేష్ దేవాలయ కమిటీ అర్చకులు కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు శాసనసభ్యులు ఉన్నారు.

## ఎన్ఎస్‌యూఐ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎం. మనిదీప్ యాదవ్ నియామకం

వార్తా 3 లో

ప్రజాబలం

11 సెప్టెంబర్ 2026 శుక్రవారం

# షెల్ పార్టీల దందా

షెల్ కంపెనీల గురించి చాలా మంది వింటారు. కానీ షెల్ రాజకీయ పార్టీలు కూడా ఉంటాయి. సేఫ్ గా అక్రమ సొమ్మును చెలామణిలోకి తెచ్చుకోవడానికి ఈ పార్టీలు ఉపయోగపడతాయి. పార్టీలు నమోదవుతాయి. ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఉండరు, ప్రజల్లో ఉనికి ఉండదు, ఆఖరుకు కార్యాలయాలకు తాళాలు వేసి ఉంటాయి.. కానీ వేల కోట్ల రూపాయల చందాలు మాత్రం ఈ పార్టీలకు అందుతూ ఉంటాయి. షెల్ రాజకీయ పార్టీలు అంటే కేవలం కాగితాల మీద మాత్రమే ఉంటూ, ఎలాంటి నిజమైన రాజకీయ లేదా ఎన్నికల కార్యకలాపాలు నిర్వహించకుండా, ప్రధానంగా పన్ను మినహాయింపులు, మనీలాండరింగ్ కోసం ఉపయోగపడే నకిలీ లేదా నిష్క్రియ రాజకీయ పార్టీలు2023-24 ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే గుజరాత్‌కు చెందిన ఆరు గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఏకంగా రూ. 1,700 కోట్ల విరాళాలు లభించాయి. దేశంలోని ఐదు ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, ఆప్, బిఎస్పి, సిపిఎం, ఎన్పీపీలన్నీ కలిసి సేకరించిన మొత్తం విరాళాలు రూ. 1,480 కోట్లు కన్నా ఈ ఆరు అనామక పార్టీల నిధులే ఎక్కువ. సాధారణంగా షెల్ కంపెనీలను పెట్టి నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే అక్రమార్కులు, ఇప్పుడు ఇన్కమ్ టాక్స్ మినహాయింపులు లభించే రాజకీయ పార్టీలను షెల్ పార్టీలు గా మార్చేసి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు.ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే.. ఏకంగా రూ. 620 కోట్లకు పైగా విరాళాలు పొందిన ఆమ్ జనమత్ పార్టీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసింది కేవలం ఒక్కటంటే ఒక్క స్థానంలో మాత్రమే! అటు నాలుగైదు పార్టీల చిరునామాలు అహ్మదాబాద్‌లోని నరోడా అనే ఒకే ఒక్క ప్రాంతంలో కేంద్రీకృతమై ఉండటం, ఆఫీసులన్నీ ఖాళీగా ఉండటం చూస్తుంటే ఇవి పక్కా వ్యూహంతో నడుస్తున్న హవాలా ముఠాలనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజారోగ్యం, ప్రజా సంక్షేమం పేరుతో వందల కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన ఎటువంటి బ్యాంక్ స్టేట్‌మెంట్లు లేదా అధికారిక ఆధారాలు లేకపోవడం ఈ షెల్ నెట్‌వర్క్ అసలు రంగును బయటపెడుతోంది.గతంలో 2019 నుండి 2024 మధ్య కాలంలో గుజరాత్‌కు చెందిన 10 అనామక పార్టీలు రూ. 4,300 కోట్లు సేకరించినట్లుగా నివేదికలు ఉన్నాయి. అంటే దేశీయంగా పన్ను ఎగవేతదారులు, కార్పొరేట్ దందాలు నడిపే ముఠాలు , నల్లధన తిమింగలాలు తమ అక్రమ సంపాదనను సురక్షితంగా రౌండ్-ట్రిప్పింగ్ చేయడానికి, ఎన్నికల నిధుల పేరుతో చట్టపరమైన రక్షణ పొందడానికి ఈ షెల్ పొలిటికల్ పార్టీలను ఒక లాండరింగ్ ఏజెంట్లుగా వాడుకుంటున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమైన ఎన్నికల వ్యవస్థను, పన్ను మినహాయింపు చట్టాలను ఆసరాగా చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులనే తొలుస్తున్న ఈ వ్యవహారం ముమ్మాటికీ ఆర్థిక నేరమే.దేశంలో ఉన్న 2,700 పైచిలుకు పార్టీల కార్యకలాపాలపై కేంద్ర ఎన్నికల కమిషన్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఆదాయపు పన్ను శాఖలు తక్షణమే ఉమ్మడి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సుప్రీం కోర్టుతీర్పురాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి షెల్ కంపెనీలను ఉపయోగించే అవకాశంపై భారత ఎన్నికల సంఘం వ్యక్తం చేసిన ఆందోళనలను కారణంగా చూపుతూ, ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేశారు.2017లో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా షెల్ కంపెనీలుగా పేర్కొన్న 300కు పైగా సంస్థల జాబితాలో ఉన్న కనీసం నాలుగు సంస్థలు, 2013-14 మరియు 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య బీజేపీకి నేరుగా మొత్తం రూ. 4.94 కోట్లు విరాళంగా ఇచ్చాయని న్యూస్‌లాండ్రీ ఇప్పుడు కనుగొంది.

వాటిలో రెండు షెల్ సంస్థలుగా జాబితా చేయబడక ముందే బీజేపీకి విరాళాలు ఇవ్వగా, వ్యాపార ఆంక్షలు విధించబడిన సెబీ షెల్ కంపెనీల జాబితా నుండి ఆ నాలుగు సంస్థలను ఇంకా తొలగించలేదు.దాదాపు ఒక నెల తర్వాతనివేదించబడిందిగత ఐదు ఆర్థిక సంవత్సరాలలో 30 కంపెనీలు బీజేపీకి రూ. 335 కోట్ల విరాళాలు ఇవ్వడానికి, కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలకు మధ్య సంబంధం ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఇప్పుడు మేము మరో 11 కంపెనీలను కనుగొన్నాము ? ఇవి 2016-17 నుండి 2022-23 వరకు బీజేపీకి రూ. 62.27 కోట్లు విరాళాలు ఇచ్చి, అదే కాలంలో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలను ఎదుర్కొన్నాయి.నిధుల మూలాలను శోధించకుండా, క్షేత్రస్థాయిలో ఉనికి లేని ఇటువంటి బోగస్ పార్టీల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, రాజకీయ నిధుల పేరుతో సాగుతున్న ఈ శ్వేతపత్ర ఆర్థిక ఉగ్రవాదానికి చట్టపరమైన కఠిన చర్యల ద్వారా శాశ్వత ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందన్న అభిప్రాయం వినిపిస్తోంది. దాతలు ఈ పార్టీలకు కోట్ల రూపాయల విరాళాలు ఇచ్చినట్లు చూపించి ఐటీ మినహాయింపు పొందుతారు. ఆ తర్వాత సదరు పార్టీ నిర్వాహకులు కొంత శాతం 'సర్వీస్ చార్జ్' (కమిషన్) మినహాయించుకుని, మిగిలిన నగదును దాతలకు తిరిగి ఇచ్చేస్తారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు

## రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి.. మేమిద్దరం తిట్టుకోవాలని చూస్తున్నారు: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**నియోజకవర్గ నిధుల కోసమే సీఎంను కలిశానన్న రాజగోపాల్ రెడ్డి**

**రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు సహజమేనని వెల్లడి**

**మంత్రి పదవులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ**

**కొండా సురేఖ విషయంలో సీఎం నిర్ణయంలో తప్పులేదని వ్యాఖ్య**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు.

ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. "ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

హైదరాబాద్: పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు.

**డ్రాలో పారదర్శకత.. అనర్హులకు చోటు లేదు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు.

**రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ**

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

**8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారం**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారం**

మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు**

గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

**పాత ప్రభుత్వ స్థలాల్లో నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు**

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

**రూ.310--320 సిమెంట్ బ్యాగ్ రూ.230కే**

ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310--320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**రాష్ట్రంలో 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత**

దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అసంపూర్తి 2BHKలకు రూ.750 కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2BHK ఇళ్లను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన 2బీఎఖ ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు.

**అసంపూర్తి ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం**

గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

**డ్వాక్రా మహిళలకు రూ.లక్ష అడ్వాన్స్**

ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని, డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

## తిరుమల శ్రీవారికి రికార్డు స్థాయిలో ఆదాయం.. ఇవాళ ఒక్కరోజే రూ.6.93 కోట్లు

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే కానుకల ప్రవాహం కొనసాగుతోంది. తాజాగా, శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి రికార్డు స్థాయికి చేరింది. గురువారం ఒక్కరోజే రూ. 6.93 కోట్ల ఆదాయం లభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ఇది ఇటీవలి కాలంలో నమోదైన అత్యధిక ఒక్కరోజు ఆదాయాలలో ఒకటి కావడం విశేషం.

గతంలో కేవలం మూడు సార్లు మాత్రమే హుండీ ఆదాయం రూ. 6 కోట్ల మార్కును దాటిందని, ఇప్పుడు ఇది నాలుగోసారి అని అధికారులు పేర్కొన్నారు. తిరుమల చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఒక్కరోజు హుండీ ఆదాయం 2023 జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినాన వచ్చిన రూ. 7.68 కోట్లు. ఆ తర్వాత ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. గతంలో 2022 అక్టోబర్‌లో రూ. 6.31 కోట్లు, 2018 జూలైలో రూ. 6.28 కోట్ల చొప్పున ఆదాయం సమకూరింది. ఇటీవల 2026 ఆగస్టు నెలలో కూడా ఒకేరోజు రూ. 6.1 కోట్ల ఆదాయం వచ్చింది.

వార్షికంగా చూస్తే, శ్రీవారి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ. 1,738 కోట్ల ఆదాయం నమోదైంది. సాధారణ రోజుల్లో శ్రీవారి హుండీకి సగటున రూ. 3 నుంచి 5 కోట్ల వరకు ఆదాయం వస్తుంటుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న హిందూ దేవాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన తిరుమల క్షేత్రానికి భక్తులు నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ రూపంలో భారీగా కానుకలు సమర్పిస్తుంటారు. ఈ నిధులను టీటీడీ ఆలయ నిర్వహణ, అభివృద్ధి, అన్నప్రసాద వితరణ, ఇతర ధార్మిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంది.

## ఈనెల 17 న పబ్లిక్ గార్డెన్ లో ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం



హైదరాబాద్, సెప్టెంబర్ 10: ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపంవద్ద, పబ్లిక్ గార్డెన్ లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కు గానూ ఈనెల 15 న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహిళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

# ఎన్ఎస్‌యూఐ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎం. మనిదీప్ యాదవ్ నియామకం



**ముషీరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, సెప్టెంబర్ 10, 2026: ఎం. మనిదీప్ యాదవ్ ని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (NSUI), తెలంగాణ -- సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు శ్రీ వినోద్ జాఖర్ జీ ఆమోదంతో, తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యాదవల్లి వెంకటస్వామి జీ సెప్టెంబర్ 9, 2026న ఈ నియామకాన్ని ప్రకటించారు. సికింద్రాబాద్ జిల్లాలో ఎన్ఎస్‌యూఐ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం, సమర్థవంతమైన సమన్వయాన్ని సాధించడం, విద్యార్థులతో అనుసంధానాన్ని పెంపొందించడం మరియు జిల్లాలో ఎన్ఎస్‌యూఐ కార్యకలాపాలను మరింత విస్తరించడం ఈ నియామక ప్రధాన లక్ష్యం. తన నియామకంపై ఎం. మనిదీప్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం మరియు విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్ జీ, తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యాదవల్లి వెంకటస్వామి జీ, ఎన్ఎస్‌యూఐ ఆల్ ఇండియా కో-కన్వీనర్ శ్రీ ఎం.డి. అక్బర్ జీకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే, ఎం. అంజన్ కుమార్ యాదవ్ , మాజీ ఎంపీ, సికింద్రాబాద్; శ్రీ ఎం. అనిల్ కుమార్ యాదవ్ , రాజ్యసభ సభ్యులు; ఎం. అరవింద్ కుమార్ యాదవ్ , జనరల్ సెక్రటరీ, తెలంగాణ యువజన కాంగ్రెస్; శ్రీ మధు సుధన్ , సికింద్రాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు;గౌరి సతీష్ , టీపీసీసీ అధికార ప్రతినిధి మరియు సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జ్; మరియు ఎస్. ధనరాజ్ , మాజీ డైరెక్టర్, సెట్విన్ కార్పొరేషన్,కు తనపై చూపుతున్న నిరంతర మార్గదర్శకత్వం, సహకారం మరియు ప్రోత్సాహానికి మనిదీప్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సికింద్రాబాద్ జిల్లాలో ఎన్ఎస్‌యూఐని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి, విద్యార్థుల సమస్యలు మరియు ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ వారి తరఫున నిరంతరం పనిచేయడానికి, విద్యార్థుల హక్కులు మరియు సంక్షేమం కోసం కృషి చేయడానికి, సికింద్రాబాద్‌లో మరింత బలమైన మరియు చురుకైన విద్యార్థి సంఘంగా ఎన్ఎస్‌యూఐని తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఎం. మనిదీప్ యాదవ్ తెలిపారు.విద్యార్థుల సంక్షేమం మరియు తెలంగాణలో ఎన్ఎస్‌యూఐ సంస్థాగత బలోపేతం కోసం జారీ చేయబడినది.

# సత్తుపల్లి అభివృద్ధిపై సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే రాగమయి చర్చ



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 10:** హైదరాబాదులో సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చర్చించారు. గురువారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ఆమె సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే రాగమయి సీఎంను కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

సత్తుపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే రాగమయి ముఖ్యమంత్రిని కోరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆమె పేర్కొన్నారు.

# ఏపీ వ్యాప్తంగా సర్కారీ మీ మార్ట్ ...

విజయవాడ, సెప్టెంబర్ 10, టైర్ వన్, టైర్ టు, టైర్ త్రీ.. ఇలా మూడంచల విధానంలో వ్యాపారం చేస్తోంది డి మార్ట్. పప్పుల నుంచి ఉప్పుల దాకా.. బట్టల నుంచి నెత్తికి రాసుకునే నూనె దాకా ఇలా ప్రతి వస్తువును వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చి.. తక్కువ ధరలో అమ్ముతూ తిరుగులేని మార్కెట్ ను డి మార్ట్ సొంతం చేసుకుందిగతంలో ఫ్యూచర్ గ్రూప్ ఆధ్వర్యంలో బిగ్ బజార్ ఉండేది. ఆ తర్వాత రిటైల్ విభాగంలోకి అనేక పెద్ద పెద్ద సంస్థలు వచ్చాయి. కాకపోతే అవేవీ కూడా మార్కెట్ పరిస్థితులను అంచనా వేయలేక.. సరైన వాటాను సొంతం చేసుకోలేకపోయాయి. రిలయన్స్.. ఆదిత్య బిర్లా.. ఇంకా అనేక పేరు మోసిన సంస్థలు ఉన్నప్పటికీ రిటైల్ విభాగంలో ఆశించిన మార్కెట్ వాటాను అందుకు లేకపోయాయి. కాకపోతే డిమార్ట్ డిఫరెంట్ ప్లాన్ తో రంగంలోకి వచ్చింది. తిరుగులేని మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. దీనిపై అనేక రకాలుగా ఆరోపణలు ఉన్నప్పటికీ డీమార్ట్ దూకుడు జోరుగాని సాగుతోంది.డి మార్ట్ దూకుడుకు కళ్లెం వేయడంలో పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలే తట్టుకోలేకపోయాయి. కానీ ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ ప్రభుత్వం భుజాలకు ఎత్తుకుంది. వాస్తవానికి ఒక కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఢీకొట్టడం.. అది కూడా ఒక ప్రభుత్వం చేయడం అనేది దేశ చరిత్రలో ఇదే తొలిసారి. వాస్తవానికి డీమార్ట్ చాప కింద నీరు లాగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. ప్రజలకు మరింత తక్కువ ధరలో సరుకులు అందించడానికి.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.


## NOTICE OF THE 84TH ANNUAL GENERAL MEETING

NOTICE IS HEREBY GIVEN that, with the requisite consent of the Members for shorter notice, the 84th Annual General Meeting of the Members of M/s Hyderabad Chemicals Pharmaceuticals Works Limited will be held on September 16, 2026 at 10:30 A.M. at Hotel Kinara Grand, 4-7-119/5/1, Main Road, Opposite CCMB, Habsiguda X Roads, Hyderabad, Telangana - 500007, to transact the following business:

**ORDINARY BUSINESS**

1. Adoption of Financial Statements

To receive, consider and adopt the Audited Financial Statements of the Company for the financial year ended March 31, 2026, together with the Reports of the Board of Directors and Auditors thereon.

"RESOLVED THAT the Audited Financial Statements of the Company for the financial year ended March 31, 2026, together with the Reports of the Board of Directors and Auditors thereon, be and are hereby received, considered and adopted."

SPECIAL BUSINESS

2. Future Course of Action of the Company

To consider and, if thought fit, to pass the following resolution:

"RESOLVED THAT the consent of the Members be and is hereby accorded to the Board of Directors to consider and evaluate the future course of action of the Company, including the possibility of closure or winding up, subject to applicable laws and necessary approvals.

RESOLVED FURTHER THAT the Directors be and are hereby authorized to take such preliminary steps and obtain professional advice as may be necessary in this regard.

RESOLVED FURTHER THAT no formal winding-up or voluntary liquidation proceedings shall be deemed to have commenced pursuant to this resolution."

EXPLANATORY STATEMENT - ITEM NO. 2

1. The Company is presently not carrying on any business operations. The Board is considering the future course of action of the Company, including the possibility of eventual closure or winding up, subject to applicable laws and approvals.

No formal action towards closure, winding up or voluntary liquidation has been initiated as at the date of this Notice.

None of the Directors or Key Managerial Personnel is concerned or interested in the resolution, except to the extent of their shareholding, if any.

NOTES

1. A Member entitled to attend and vote is entitled to appoint a proxy to attend and vote on his/her behalf. The proxy need not be a Member.
2. The Proxy Form, duly completed and signed, should be deposited at the Registered Office of the Company at least 48 hours before the Meeting.
3. The AGM is being convened at shorter notice with the requisite consent of the Members.

By Order of the Board

For M/s HYDERABAD CHEMICALS AND PHARMACEUTICAL WORKS LIMITED

PANKAJ BALDAWA — DIN-05309795

KRISHNA KUMAR BALDAWA — DIN-02763290

Date: 09/09/2026;Place: Hyderabad


# ఫ్లోటింగ్ సోలార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## రిజర్వాయర్లపై ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మొదటి పేజీ తరువాయి** 18,543 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్:

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని శాసనసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ సుమారు 15 వేల మెగావాట్లు ఉండగా.. సెప్టెంబర్ 9 నాటికి అది 19వేల మెగావాట్లకు చేరిందని చెప్పారు. పారిశ్రామిక వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆయన వివరించారు. పెరుగుతున్న డిమాండ్ రాష్ట్ర అభివృద్ధికి సానుకూల సంకేతమే అయినప్పటికీ, అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

ఏడాదికి రూ.19 వేల కోట్ల సబ్సిడీ:

వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీ భరిస్తోందని డిప్యూటీ సీఎం చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా సుమారు 55 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నారు. దీనికి మరో రూ.5 వేల కోట్ల వరకు వ్యయం అవుతోందన్నారు. మొత్తంగా దాదాపు రూ.19 వేల కోట్లను ఏటా విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోందని ఆయన సభకు తెలిపారు. భవిష్యత్తులో ఈ భారాన్ని తగ్గించుకుంటూనే ప్రజలకు ఉచిత విద్యుత్ అందించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

80 గ్రామాల సోలరైజేషన్:

అమ్రాబాద్ గిరిజన ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సుమారు 80 గ్రామాలను పూర్తిగా సోలరైజ్ చేసి, అక్కడ మైక్రో గ్రిడ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి, మైక్రో గ్రిడ్ ద్వారా విద్యుత్ వినియోగించే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామన్నారు.

ఇందిరా సౌర గిరి జల వికాసం:

గిరిజన ప్రాంతాల్లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ కింద గతంలో పంపిణీ చేసిన సుమారు 6.70 లక్షల ఎకరాలను కూడా సౌర విద్యుత్ ప్రోత్సాహానికి వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పేరుతో పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవకాశం ఉన్నచోట సోలరైజేషన్, ఫ్లోటింగ్ సోలార్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, ముఖ్యంగా మంథని నియోజకవర్గంలోని కాటారం, మహాముత్తారం వంటి ప్రాంతాల్లోనూ అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలి:

రైతులు, ప్రజలు సౌర విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన పెంచుకోవాలని భట్టి విక్రమార్క కోరారు. తమ తమ గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రైతులకు ఎమ్మెల్యేలు అవగాహన కల్పించాలని సూచించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేలా ప్రజలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రశాంతంగా, భద్రతతో నిర్వహించాలి

## మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశంలో పోలీస్ కమిషనర్





**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 10:** గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ.. సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు.

రానున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ మండపాల నిర్వాహకులతో నగరంలోని సూర్య తేజ ఫంక్షన్ హాల్ లో పోలీసు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి, ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, పోలీసు శాఖ సూచనలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. ఖమ్మం మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ లోని కొత్తూరు చెరువులో కొనసాగుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించాలి అన్నారు. అదేవిదంగా

గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ పోర్టల్ జూశీశ్రీఱఛవజూశీఖ్రీ.ంజూశీ-శ్రీఱఛవ.ౖశీజ.ఱఅ లో రిజిస్టర్ అయి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికతో నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు.

మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ కనెక్షన్లు మరియు వైరింగ్‌ను నిపుణులతో తనిఖీ చేయించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించకుండా అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని, మండపాల వద్ద అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయకూడదని స్పష్టం చేశారు.

మండపాల వద్ద భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించకుండా నిబంధనలను పాటించాలని తెలిపారు.

గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణ పాటించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ ప్రమాదాలు, నీట మునిగే ప్రమాదాలు తదితర ఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో మండపాల నిర్వాహకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి, సమస్య లేదా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.

గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు

1) గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్వాహకుల పేర్లు మరియు సంప్రదింపు నంబర్లు పొందుపర్చాలి.

2) విగ్రహం ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే, సంబంధిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతర లేదని ధృవీకరణ పత్రం పొందాలి.

3) నిర్వాహకులు "విగ్రహాలను రహదారిలో కాని వివాదాస్పద స్థలాల్లో ప్రతిష్టించవద్దని విజ్ఞప్తి.

4) ప్రధాన రహదారులపై మరియు ట్రాఫిక్ రద్దీగా వుండే రహదారులపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదు.

5) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు.నాణ్యమైన విద్యుత్ తీగలు మరియు పరికరాలు గణేష్ పండల వద్దఉపయోగించాలి.

6) మండపాల వద్ద డీజేలకు అనుమతి ఇవ్వబడదు,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు(ధ్వని పరిమాణం తప్పనిసరిగా నాన్ డిస్ట్రబెన్స్ లెవెల్‌లో ఉండాలి) మాత్రమే అనుమతించబడతాయి.అదేవిధంగా ఉదయం 6.00 నుండి రాత్రి 10.00 వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి.

7) గణేష్ మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు చేపట్టకూడదు.

8) ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

9) ప్రతి గణేష్ మండపం వద్ద నోటీసు బోర్డును, పాయింట్ బుక్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా నిర్వాహకుల సంప్రదింపు నంబర్లు మరియు వివరాలను పొందుపర్చాలి.

10) అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్‌గా ఉండేలా చూసుకోండి. తగినంత నీరు ఇసుక అందుబాటులో వుండాలి. కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, భానుప్రకాష్, ఉస్మాన్ షరీఫ్, సత్యనారాయణ విద్యుత్ శాఖ డిఇ రామారావు, ఫైర్ అధికారి రామిరెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ వినోద్ లౌహిటి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# విజయసాయిరెడ్డి వెనుక ఉంది ఎవరు

నెల్లూరు, సెప్టెంబర్ 10, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీకి మొదటి నుంచి ఆయువుపట్టులా వ్యవహరించిన సీనియర్ నేత, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సొంతంగా నూతన రాజకీయ పార్టీని స్థాపించబోతున్నారు. ప్రస్తుత రాజకీయాల్లోపార్టీ నడపడం అంటే వందల కోట్ల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. సాధారణంగా ఏ నాయకుడైనా వందల కోట్ల రూపాయల ఆర్థిక వనరులను వెచ్చించి పార్టీ పెడుతున్నారంటే.. తాము ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. కానీ, విజయసాయిరెడ్డి మాత్రం కోట్లాది రూపాయల నిధులను, డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సిద్ధం చేసుకుంటూనే.. నేను సీఎం కాను, వేరొకరిని సీఎం చేయడానికి మాత్రమే ఈ పార్టీ అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ విచిత్రమైన వైఖరి వెనుక పెద్ద ఎత్తున తెరవెనుక సమీకరణాలు, దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే చర్చ నడుస్తోందివిజయసాయిరెడ్డి ప్రతిపాదిత వ్యూహాన్ని నిశితంగా పరిశీలిస్తే.. ఇది కేవలం ఒక పార్టీ స్థాపన మాత్రమే కాకుండా, వోట్ స్ప్లిటర్, ఒక పొలిటికల్ ప్రాక్సీ వ్యూహంలా కనిపిస్తోంది. సొంతంగా మాస్ ఫాలోయింగ్ లేదా నేరుగా సీఎం అయ్యేంత ప్రజాదరణ లేదనే స్పృహ ఆయనకు పక్కాగా ఉంది. అందుకే, ప్రత్యక్షంగా సీఎం పీఠం రేసులో లేనని ప్రకటిస్తూనే, వచ్చే ఎన్నికల్లో నిర్ణయాత్మక ఓటు బ్యాంకును చీల్చడం లేదా కింగ్ మేకర్ పాత్రను పోషించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రధానంగా రాయలసీమ, కోస్తా జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ అసంతృప్త నేతలను, సామాజిక వర్గ సమీకరణాలను తనవైపు తిప్పుకోవడం ద్వారా ఒక 'మూడో శక్తి'గా రూపాంతరం చెంది, గెలుపోటములను ప్రభావితం చేయవచ్చనేది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ కోట్లాది రూపాయల ప్రయోగానికి అసలు వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఆయనకు ఉన్న ఆర్థిక అవసరం ఏంటి? అనే అంశంపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఒక వర్గం కథనం ప్రకారం.. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్‌సీపీకి పడే రెడ్డి, ఇతర సంప్రదాయ ఓట్లను చీల్చి, ప్రధాన విపక్షానికి దెబ్బకొట్టేలా తెరవెనుక కొన్ని అధికార శక్తులు ఈ ప్రయోగానికి ఆజ్యం పోస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా వందల కోట్లు ఖర్చు పెడుతున్నారా లేక గేమ్ ఛేంజర్ గా నిలిపేందుకు అదృశ్య శక్తులు వెనకుండి ఫండింగ్ ఇస్తున్నాయా అనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఇది వైఎస్ జగన్‌తో మళ్లీ బార్గేనింగ్ చేయడానికి విజయసాయిరెడ్డి ఆడుతున్న మైండ్ గేమ్ అనే వాదన కూడా బలంగా ఉంది. నేరుగా వైఎస్ఆర్‌సీపీలోకి వెళ్లే ద్వారాలు మూసుకుపోవడంతో, బయట ఒక రాజకీయ వేదికను, స్వంత డిజిటల్ మీడియా సామ్రాజ్యాన్ని సృష్టించుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను మళ్లీ గుర్తించేలా ఒత్తిడి తేచ్చే యత్నం చేస్తున్నారని భావిస్తున్నారు. తన పార్టీ ద్వారా కొంత ప్రభావం చూపించగలనని నిరూపిస్తే, జగన్ మళ్లీ తగిన స్థానం ఆఫర్ చేస్తారనే దూరదృష్టితోనే "వేరొకరిని సీఎం చేస్తా" అనే పదాన్ని వాడుతున్నారని విశ్లేషిస్తున్నారు.రాజకీయంలో కేవలం డబ్బులు చల్లి, డిజిటల్ మీడియా సంస్థలను నడిపినంత మాత్రాన ఓటర్లు జై కొడతారనుకోవడం అజ్ఞానమే అవుతుంది. గతంలో కూడా కేవలం ఫండింగ్‌ను నమ్ముకుని, వేరే వ్యూహకర్తల డైరెక్షన్‌లో వచ్చిన మూడో ప్రత్యామ్నాయాలు దారుణంగా విఫలమైన చరిత్ర ఏపీకి ఉంది. విజయసాయిరెడ్డి వద్ద ఉన్న వనరుల కోసమో, డిజిటల్ మీడియా నిధుల కోసమో ఆయన చుట్టూ చేరే తాత్కాలిక నేతలు, అవకాశవాదుల వల్ల పార్టీకి కేడర్ నిర్మాణం సాధ్యం కాదు. వేరొకరిని సీఎం పీఠంపై కూర్చోబెట్టడానికి సొంత జేబుల నుంచి వందల కోట్లు తగలేసేంత అమాయకత్వం రాజకీయాల్లో ఏ నాయకుడికీ ఉండదు. విజయసాయిరెడ్డి ఆడుతున్న ఈ విచిత్రమైన కింగ్ మేకర్ డ్రామా వెనుక ఏ అదృశ్య రాజకీయ శక్తి ఉందో, ఆయన అసలు టార్గెట్ జగనా లేక కూటమి ప్రభుత్వమా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవ్వాల్సి ఉంది.

## 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్

విజయవాడ, సెప్టెంబర్ 10,ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టాలని భావిస్తున్న ప్రతిష్టాత్మక 'సీ ప్లేన్' ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. ఏపీ జలాలపై ఈ విమానాలను నడిపేందుకు ఆసక్తి చూపిస్తూ 'మే హెయిర్', 'స్కైహోప్' వంటి ప్రముఖ దేశీయ విమానయాన సంస్థలు సమర్పించిన నివేదికలకు కేంద్ర పౌరవిమానయాన శాఖ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. పర్యాటక ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, టూరిస్టులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.ఈ ప్రాజెక్టు సజావుగా సాగడానికి కీలకమైన 'వాటర్ డ్రోమ్' అంటే నీటిపై రన్‌వేలు, మౌలిక వసతుల ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వీటి నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ పనుల కోసం త్వరలోనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది కీలక పర్యాటక మరియు ఆధ్యాత్మిక కేంద్రాలను గుర్తిస్తూ, సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో ఈ వాటర్ డ్రోమ్ నెట్‌వర్క్‌ను డెవలప్ చేయనున్నారు.కేంద్ర ప్రభుత్వ 'ఉడాన్' ఉద్దీపన పథకం మద్దతు కూడా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ చాలా త్వరగా కార్యరూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. తొలి విడతలో భాగంగా.. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ (పున్నమి ఘాట్), విశాఖ సాగరం, మరియు శ్రీశైలం కృష్ణా నది పరివాహక ప్రాంతాల మధ్య ఈ సీ ప్లేన్లు రాకపోకలు సాగించనున్నాయి.

# ఫ్యాన్ రెక్కలు విలవిల

విజయనగరం, సెప్టెంబర్ 10, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికి క్షేత్రస్థాయి పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దశాబ్దాల పాటు రాజకీయాన్ని శాసించిన ఉద్దండులైన సీనియర్ నేతలు సైతం ఇప్పుడు వైసీపీ జెండా మోసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గత ఎన్నికల్లో అధికార దర్పం, అపరిమితమైన ఆర్థిక బలం, పటిష్టమైన యంత్రాంగం ఉండి కూడా దాదాపుగా ప్రతి నియోజకవర్గంలో 50 వేల ఓట్లకు పైగా భారీ వ్యత్యాసంతో ఓడిపోవడం సదరు నేతల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఆ ఘోర పరాభవం తర్వాతే అనేకమంది సీనియర్లు సైలెంట్ అయిపోగా, మరికొందరు ఇప్పటికే పార్టీకి గుడ్ బై చెప్పారు.ఉత్తరాంధ్ర సామాజిక సమీకరణాలను, ప్రజల ఆలోచనా ధోరణిని నిశితంగా పరిశీలిస్తే.. వైఎస్ఆర్‌సీపీ మళ్లీ పూర్వవైభవాన్ని పుంజుకోవడం దాదాపు అసాధ్యమనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో తమ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పరిస్థితిని ముందే అంచనా వేసిన సీనియర్ నాయకులు ఒక వ్యూహాత్మక నిర్ణయానికి వచ్చారు. తాము ప్రత్యక్ష రాజకీయాల నుంచి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించడం లేదా క్రియాశీల పాత్ర నుంచి తప్పుకోవడం ఒక మార్గమైతే.. తమ వారసులను, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని కూటమి పార్టీలైన టీడీపీ లేదా జనసేనలోకి పంపించడం మరో ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు.

ముఖ్యంగా విజయనగరం, విశాఖ జిల్లాల్లో బారీ స్థాయిలో సాగుతున్న ఈ వలసలు కేవలం ఆరంభం మాత్రమే. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రాదేశిక, పురపాలక వర్గాల్లో ఉనికి కాపాడుకోవడానికి స్థానిక నేతలు డిఫెన్స్‌లో పడ్డారు. వైసీపీ గుర్తుపై పోటీ చేస్తే గెలుపు అవకాశాలు శూన్యమని భావిస్తున్న వీరు, కూటమిలోని ఏ పార్టీ తలుపు తడితే ఆ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి మద్దతు లేకుండా క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయడం సాధ్యం కాదనే స్పష్టత రావడంతో, క్యాడర్ మొత్తం ఒక్కొక్కటిగా ఖాళీ అవుతోంది.పార్టీ కేంద్రీకృత నాయకత్వ శైలి, ఎన్నికల ఫలితాల తర్వాత కనీస దిశానిర్దేశం లేకపోవడం కూడా ఈ సీనియర్ల నిష్క్రమణకు వేగవంతం చేస్తోంది. ఏ రాజకీయ పార్టీకైనా క్షేత్రస్థాయి నాయకులే ఆయువుపట్టు. కానీ ఉత్తరాంధ్ర వ్యాప్తంగా అగ్రనేతల నుంచి క్షేత్రస్థాయి ప్రసిద్ధ ముఖాల వరకు అందరూ జెండా ఎత్తేస్తుండటంతో వైసీపీ పూర్తిగా దెబ్బతింది. రాబోయే స్థానిక పోరు ముగిసేనాటికి ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ బోర్డు తిప్పేయడం లేదా నామమాత్రపు స్థానానికి పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆయువు పై పట్టు...

ఉత్తరాంధ్రలో వైసీపీకి ఊహించని దెబ్బ తగిలింది. వైసీపీకి బొత్స సత్య నారా యణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేశారు. చిన్న శ్రీను రాజీనామా ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాలను కుదిపేసింది. తన రాజీనామా లేఖను చిన్న శ్రీను జగన్ కు పంపారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చిన్న శ్రీను ఆ లేఖలో పేర్కొన్నా అసలు కారణాలు వేరే ఉన్నాయంటున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి, జిల్లా అధ్యక్ష పదవికి మజ్జి శ్రీనివాసరావు రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ప్రకటించారు.

భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పదవికి కూడా చిన్న శ్రీను రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీకి ఉత్తరాంధ్రలో చిన్న శ్రీను బలమైన నేతగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా బొత్స సత్యనారాయణ, ఆయన మేనల్లుడు చిన్న శ్రీనుకు మధ్య అంతర్గత యుద్ధం నడుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీకి రాజీనామాచేయడం వెనక అనేక కారణాలున్నాయి. గత కొన్ని రోజుల నుంచి బొత్స సత్యనారాయణ పార్టీకి రాజీనామా చేస్తారని ప్రచారం జరిగింది. అయితే బొత్స సత్యనారాయణ కాదని, ఆయన మేనల్లుడు రాజీనామా చేస్తారని నిన్న వెల్లడయింది. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీని వీడుతున్నట్లు చిన్న శ్రీను తన రాజీనామా లేఖలో అధికారికంగా పేర్కొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపించారు. చిన్న శ్రీను తన పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పదవులకు కూడా రాజీనామా చేశారు.చిన్నశ్రీను రాజీనామాకు దారితీసిన అసలు కారణాలు అనేకం ఉన్నాయంటున్నారు..

రాజీనామా లేఖలో ఆయన కేవలం వ్యక్తిగత కారణాల వల్లే పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న అసలు కారణాలు మాత్రం వేరేలా ఉన్నాయి. అధికారికంగా వ్యక్తిగత కారణాలని చెప్పినప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మరియు అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం ఈ నిర్ణయం వెనుక కొన్ని కీలక వ్యూహాలు ఉన్నట్లు తెలుస్తోంది. బొత్స సత్యనారాయణ కుమార్తె పొలిటికల్ ఎంట్రీయే చిన్న శ్రీను రాజీనామాకు కారణమని తెలుస్తోంది. తన కుమార్తెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని బొత్స భావిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను విజయనగరం మేయర్ పీఠంపై కూర్చోబెట్టాలని, ఈ మేరకు బొత్స మేయర్ అభ్యర్థి తన కుమార్తె అని ప్రకటించిన తర్వాతనే చిన్న శ్రీను రాజీనామా చేశారని అంటున్నారు.

# ఈశ్వర్ సాయి మిస్సింగ్

హైదరాబాద్, సెప్టెంబర్ 10, ఈశ్వర్ సాయి ఎక్కడున్నాడు.. పోలీసులకు మాధురి రాథోడ్ ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేసింది. ఈశ్వర్ సాయి భార్య కూడా తెగ వెతుకులాడుతోంది. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్.. అతని ఫోన్ లొకేషన్ కూడా ట్రేస్ కావడం లేదు.. కనీసం మనిషి జాడ కూడా కనిపించడం లేదు. ఇంతటి సోషల్ మీడియా జీవితంలో.. టెక్నాలజీ మనిషి జీవితంలో ఒక భాగమైన ఈ కాలంలో అతని జాడ కనిపించ కపోవడం నిజంగా ఆశ్చర్యకరం..ఇంతకీ ఈశ్వర్ సాయి ఎక్కడున్నాడు.. ఏమైపో యాడు.. ఎవరైనా కిడ్నాప్ చేశారా.. లేదా తను ఏమైనా కఠిన నిర్ణయం తీసుకున్నాడా.. మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం చేసిన తర్వాత అతడు కనిపించడం లేదు. వాస్తవానికి ఈశ్వర్ సాయికి ఫోక్ పాటల ద్వారా విపరీతమైన ప్రచారం వచ్చింది. అతడు ఒక సెలబ్రిటీ అయిపోయాడు. ముఖ్యంగా బాసింగా బలాలు పాటతో అతడు ఎక్కడికి వెళ్లిపోయాడు. అన్ని బాగుంటే రాము రాథోడ్ లాగా తిరుగులేని స్థాయిని అందుకోవాల్సిన అతడు.. పనికిమాలిన పనిచేసి అడ్డంగా దొరికిపోయాడు. ఒక రకంగా చెప్పాలంటే తన భార్య ముందు దోషి లాగా నిలబడ్డాడు.వేములవాడలో ఆరోజు మాధురి రాథోడ్తో రెడ్ హ్యాండెడ్గా దొరికిన తర్వాత.. ఈశ్వర్ సాయి ఒక వీడియో విడుదల చేశాడు. తమ ఇద్దరి మధ్య అలాంటిది ఏమీ జరగలేదని క్లారిటీ ఇచ్చాడు. తను చాలా మంచిదని సర్టిఫికెట్ కూడా ఇచ్చాడు. ఇంతవరకు బాగానే ఉన్నప్ప టికీ మాధురి రాథోడ్ అసలు విషయాన్నీ బయటపెట్టింది. తనకు మంచి మంచి అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి.. మాయ మాటలు చెప్పాడ.. పెళ్లి చేసుకుంటానని అన్నాడని.. శారీరకంగా సంబంధం కూడా పెట్టుకున్నాడని ఆరోపించింది. అంతేకా కుండా తనను మోసం చేశాడని.. అతనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతని మీద చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతో మాధురి రాథోడ్ ఆత్మహత్యకు ప్రయత్నిం చింది.

తన ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకోవడానికి యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను కాపాడారు.ఆ తర్వాత మళ్లీ ఆమె పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు ఈశ్వర్ సాయి కోసం అతని భార్య కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. ఆమె కూడా పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఇటు సిటీ పోలీసులు.. అటు ఈశ్వర్ సాయి స్వస్థలం లో ఉన్న పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. కానీ ఇంతవరకు అతని జాడ కనిపించడం లేదు. ఇంతకీ అతను ఎక్కడున్నాడు.. ఏమైపోయాడు.. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకోవాలి ఎక్కడికి వెళ్లిపోయాడు..బంగారం లాంటి భార్య ఉండగా.. ప్రేమకు ప్రతిరూపం లాంటి కుమారుడు ఉండగా మాధురి రాథోడ్ తో అతడు వ్యవహారం ఎందుకు మొదలు పెట్టాడు.. మొదట్లో మాధురి రాథోడ్ తో తనకు ఎటువంటి రిలేషన్ లేదని చెప్పిన అతడు.. ఆ తర్వాత ఎందుకు పారిపో యాడు.. మొదట్లో నోరు విప్పకుండా నిశ్శబ్దంగా ఉన్న మాధురి రాథోడ్.. ఆ తర్వాత తన మధ్య ఆ సంబంధం ఉందని ఎందుకు చెప్పింది.. ఇప్పుడు ఏకంగా పోలీసులకు ఫిర్యాదు ఎందుకు చేసింది.. వేములవాడ ఘటన తర్వాత మాధురి రాథోడ్ సెల్ఫీ వీడియో తీసుకుంది.. తన ఏదో విభిన్నమైన కంటెంట్ ఇస్తుంటే దాని పక్కనపెట్టి.. దీనిని చూస్తున్నారని కవర్ చేయడం మొదలు పెట్టింది. చివరికి ఈశ్వర్ సాయితో తనకు ఆ సంబంధం ఉందని క్లారిటీ ఇచ్చింది.. మొదట్లో కాదని.. ఇప్పుడు అవునని.. అసలు ఈ సెలబ్రిటీలకు బుర్ర లేదా.. అసలు బుర్రలో మెదడు లేదా.. కాస్త సెలబ్రిటీ తను రాగానే వాళ్ళు ఏమైనా డెమి గాడ్స్ అనుకుంటున్నారా.. సమాజంలో ఈ తరహ వార్తలు వారి గురించి పెరిగిపోతుంటే ఏమీ అనుకోరా.. సెలబ్రెటీలు కాబట్టి కామన్ అని భావిస్తారా.. కానీ ఇంతటి ఎపిసోడ్లో వెర్రి వాళ్ళు ఎవరైనా ఉన్నారంటే అది చూసే ప్రేక్షకులు మాత్రమే.. ప్రేక్షకుల ధోరణి మారితేనే సెలబ్రిటీలు నేలకు వస్తారు. తాము కూడా మనుషులమని భావిస్తారు. అదిగో అప్పటిదాకా ఈ సెలబ్రిటీల చిల్లర భాగోతాలు ఇలా సాగిపోతూనే ఉంటాయి.

# పీక్స్ కు చేరిన పబ్లిసిటీ పిచ్చి....

న్యూయార్క్, సెప్టెంబర్ 10, ఈ ప్రపంచంలో ఉన్న ఏ రాజకీయ నాయకుడైనా సరే ప్రచారాన్ని కోరుకుంటారు. కాకపోతే ఆ ప్రచారం జనాలు ఆమోదించే స్థాయిలో ఉండాలి. అది మరింత పెరిగిపోతే జనాలు ఆ రాజకీయ నాయకులను ట్రోల్ చేస్తూ ఉంటారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ట్రోల్ అవుతున్నారు. వాస్తవానికి ట్రంప్ ట్రోల్ అవడం ఇదే తొలిసారి కాకపోయినప్పటికీ.. ఈసారి ఆయన గురించి సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ నడుస్తోంది. దీనికి ప్రధాన కారణం ట్రంప్ తీసుకున్న ఒక నిర్ణయం.అమెరికాలో అక్కడి నాణేలు ముద్రించే టంక శాల 250 వ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముఖం కల్పించే విధంగా ఒక డాలర్ కాయిన్ విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్టు యూఎస్ మింట్ కాంపౌండ్ ప్రకటించింది. కాయిన్ మీద ఒకవైపు ట్రంప్ ముక్క చిత్రం.. లిబర్టీ.. 1776 అని ప్రింట్ చేశారు. ఇంకొక వైపు అమెరికా సంయుక్త రాష్ట్రాల అధికారికముద్రం ఉండే విధంగా చిత్రం రూపొందించారు. దీనికి అమెరికా కమిషన్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ తన ఆమోదాన్ని తెలిపింది.ఈ నాణేల తయారీకి సంబంధించి కమిషన్ సభ్యులను ట్రంప్ స్వయంగా నియమించడం విశేషం. అయితే తన ముఖచిత్రాన్ని నాణెం మీద ముద్రించాలి అనే కోరిక రావడం చాలా అసాధారణమైనదని.. ట్రంప్ ఆ మధ్య వ్యాఖ్యానించడం విశేషం. అమెరికన్ చట్టాల ప్రకారం అధ్యక్షుడు జీవించి ఉండగానే అమెరికన్ కరెన్సీ మీద ముద్రించడం నిషేధం. కానీ ప్రత్యేకమైన పరిస్థితుల్లో స్పెషల్ కాయిన్స్ ముద్రించడానికి.. ఆదేశాలు జారీ చేయడానికి అక్కడి ట్రెజరీ సెక్రటరీకి అధికారం ఉంటుంది. 20 కాయిన్స్ ఉన్న ఒక రోల్ ధర 61 అమెరికన్ డాలర్లుగా నిర్ణయించారు. అలాగే 100 కాయిన్స్ ఉన్న ఒక బ్యాగ్ ధర 154.50 డాలర్లుగా ప్రకటించారు.ట్రంప్ ముఖ చిత్రాన్ని కాయిన్స్ మీద ముద్రించడాన్ని అక్కడి విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ కు ప్రచార పిచ్చి పీక్స్ లోకి వెళ్లిందని కామెంట్లు చేస్తున్నారు. అధ్యక్షుడు బతికి ఉండగానే ఇలాంటి పిచ్చి చేష్టలకు పాల్పడటం ట్రంప్ లో ఉన్న మరో కోణానికి నిదర్శనమని అక్కడికి విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ చర్యను ట్రంప్ సమర్థించుకోవడం విశేషం. గ్లోబల్ మీడియా మాత్రం ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా విమర్శిస్తున్నది.

# మెట్రో, ఆర్టీసీ పాస్...

హైదరాబాద్, సెప్టెంబర్ 10, నగరంలో ప్రయాణించాలంటే కేవలం బస్సులే కాదు, మెట్రో రైలులోనూ వెళ్లాల్సి వస్తుంది. అందుకే ప్రయాణికులకు త్వరలోనే ఒకే పాస్తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వెసులుబాటు కల్పించనున్నారు. ఈ ఉమ్మడి ట్రావెల్ పాస్ ను త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన తర్వాత ఉమ్మడి పాస్ లాంచ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. దాంతో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఒక రోజు, ఒక వారం పాస్, ఒక నెలకు చెల్లుబాటు అయ్యేలా 3 వేర్వేరు రకాల పాస్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం గత కొన్ని నెలలుగా భావిస్తోంది.ఈ ఉమ్మడి కార్డు కు సంబంధించిన ఛార్జీల ప్రతిపాదనలను ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదన ప్రకారం నెలవారీ ఉమ్మడి పాస్ ధరను రూ.7,500 గా నిర్ణయించారు. ఈ పాస్ ద్వారా మెట్రో రైలుతో పాటు సిటీ ఆర్డినరీ నుంచి ఏసీ బస్సుల వరకు అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధి వరకు ప్రయాణించవచ్చు. అయితే, ప్రస్తుతానికి ఎంఎంటీఎస్ రైళ్లు, సెట్విన్ బస్సులను ఈ ఉమ్మడి కార్డు పరిధిలోకి తీసుకురావడానికి మాత్రం ఏ ప్లాన్స్ లేవని అధికారులు తెలిపారు.

ఆర్టీసీలో ఒకరోజు పాస్ రూ.100 కాగా, మెట్రో రైలు కు రూ. 250.. వీటి మొత్తం రూ.350 అవుతుంది.

అదే ఒక వారం రోజులకు అయితే ఆర్టీసీ పాస్ రూ.400, మెట్రోకు రూ.1800.. ఓవరాల్గా రూ.2200 అవుతుంది.

నెల రోజులకు ఆర్టీసీ పాస్ రూ.1500 కాగా, మెట్రో అయితే రూ.6000.. మొత్తం 7500 అవుతుందని ప్రతిపాదించారు. త్వరలోనే ఈ ఉమ్మడి పాస్ అందుబాటులోకి తేవడానికి అధికారులు ప్రయత్నాలు చేశారు.

## శంకర్ పల్లి మండలం చందిప్పలో అర్ధరాత్రి దారుణం:
## వృద్ధురాలిపై కత్తులతో దాడి!

రంగారెడ్డి శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఘోర కలకలం రేగింది.ఒంటరిగా ఉన్న ఓ 80 ఏళ్ల వృద్ధురాలిపై దుండగులు కత్తులతో దాడికి తెగబడ్డారు.చోరీ ప్రయత్నంలో భాగంగానే ఈ దాడి జరిగినట్లు స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.గ్రామస్తులు మరియు పోలీసుల కథనం ప్రకారం.. చందిప్ప గ్రామానికి చెందిన చాకలి రుక్కమ్మ (80) అనే వృద్ధురాలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు12:10గంటల ప్రాంతంలో) మూత్ర విసర్జన కోసం ఇంటి బయటకు వచ్చారు.ఆ సమయంలో ఇంటి పక్కన ఎవరో నక్కి ఉన్నట్లు గమనించిన ఆమె,అనుమానంతో గట్టిగా కేకలు వేశారు.దీంతో తీవ్ర ఆందోళనకు గురైన దుండగులు, తమ వెంట తెచ్చుకున్న కత్తులతో వృద్ధురాలిపై ఒక్కసారిగా దాడి చేసి అక్కడి నుంచి చీకట్లోకి పరారయ్యారు.ఆమె పెట్టిన ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల ప్రజలు వెంటనే సంఘటనా స్థలానికి పరుగులు తీశారు.రక్తపు మడుగులో ఉన్న వృద్ధురాలిని చూసి షాక్కు గురైన స్థానికులు,వెంటనే శంకర్ పల్లి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందిన వెంటనే శంకర్ పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.పరిస్థితిని సమీక్షించి, బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రాథమిక సమాచారం ప్రకారం నలుగురు నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు గుర్తించామని,వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశామని స్పష్టం చేశారు.త్వరలోనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని భరోసా ఇచ్చారు.

# మళ్లీ భగ్గుమంటున్న క్రూడాయిల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి.దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది.మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది.

చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమీని రిస్క్లో పడేస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ.7.35, డీజిల్ ధర రూ.7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్లో నెలకొన్నాయి. ఇది మార్కెట్లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

ఇక ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# బాపు టార్గెట్ తో గులాబీ దళం యాక్టివ్

హైదరాబాద్, సెప్టెంబర్ 10, తెలంగాణ రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ను టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్కు లాభమా లేదా నష్టమా అనేది చర్చనీయాంశమైంది. నేటికీ కేసీఆర్ పట్ల తెలంగాణను తెచ్చారన్న అభిప్రాయం ఉంది. ఆయన పాలన శైలి నచ్చకపోవచ్చు కానీ, ఆయనంటే తెలంగాణ ప్రజలకు గౌరవం అనేది తరగనిది. కానీ కాంగ్రెస్ ఇటీవల కాలంలో కేసీఆర్ ను లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం రాజకీయం గానష్టమేనన్న అంచనాలు వినపడుతున్నాయి . కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ తాము కేసీఆర్ చావును కోరుకుంటున్నామని చెప్పడం, ఎర్రవెల్లి ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం వంటివి బీఆర్ఎస్ కు కలసి వచ్చే అంశమని భావిస్తున్నారు.

కేసీఆర్ తెలంగాణ ఉద్యమ నేతగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి. ఆయనపై వ్యక్తిగత విమర్శలు లేదా తీవ్రమైన దాడులు ప్రజల్లో ఆయన పట్ల సానుభూతి నిపెంచే అవకాశం ఉంది.అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఆరు గ్యారంటీలు, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా, కేవలం ప్రతిపక్ష నేతను వేధించడానికే ప్రాధాన్యత ఇస్తోందనే అభిప్రాయం సాధారణ ప్రజల్లో బలపడితే అది కాంగ్రెస్కు రాజకీయంగా నష్టం కలిగిస్తుంది. కేసీఆర్ శాసనసభకు రాకుంటే, ప్రజాసమస్యలను ప్రస్తావించకుంటే ఆయనకే నష్టం.

ఎన్నికల సమయంలో జనం తగిన రీతిలో తీర్పు చెబుతారు. కేసీఆర్ కేవలం అసెంబ్లీ సమావేశాలకు మాత్రమే కాదు...ప్రజా సమస్యలపై రాష్ట్రంలో పర్యటించలేదు. కానీ కేసీఆర్ సభకు రాలేదంటూ నిరసనలు తెలియజేయడం, ఎమ్మెల్సీ స్పీకర్ ను తిడితే ఫామ్ హౌస్ ముట్టడికి ప్రయత్నించడం కొంత కాంగ్రెస్ కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

. కేసీఆర్ను టార్గెట్ చేయడం వల్ల నిస్తేజంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ ఒక్కసారిగా అప్రమత్తమై, కాంగ్రెస్ సర్కార్పై ఎదురుదాడికి దిగే అవకాశం ఉంది.అయితే కాంగ్రెస్కు లాభం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. కాంగ్రెస్ ఎజెండా ప్రకారం బీఆర్ఎస్, కేసీఆర్లను నిరంతరం టార్గెట్ చేయడం ద్వారా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్సేనని, బీజేపీకి అక్కడ చోటు లేదనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపవచ్చు.

దీనివల్ల ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా చూసుకోవచ్చు కేసీఆర్ హయాంలో జరిగిన లోపాలను (ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలు, ధరణి లోపాలు) నిరంతరం ప్రస్తావించడం ద్వారా, తాము ఎందుకు అధికారంలోకి రావాల్సి వచ్చిందో ప్రజలకు కాంగ్రెస్ సమర్థించుకోగలుగుతుంది. తమ నాయకత్వం బలంగా ఉందని, కేసీఆర్ వంటి సీనియర్ నేతను సైతం ఢీకొట్టగలదని చూపించడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలలో ధైర్యాన్ని నింపవచ్చు. .. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, అది వ్యక్తిగత దూషణలు, శృతిమించిన దాడుల స్థాయికి వెళ్తే మాత్రం కాంగ్రెస్కు నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు ఎప్పుడూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలును బట్టే తీర్పు ఇస్తారు కానీ, కేవలం ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం వల్ల మాత్రమే ఓట్లు పడవు.

# ఉద్యమాల గడ్డ నుంచే తొలి పోరు

వరంగల్, సెప్టెంబర్ 10, తెలంగాణ రాజకీయ యవనికపై సరికొత్త అధ్యాయానికి తెరలేపిన కల్వకుంట్ల కవిత, తన కొత్త రాజకీయ వేదిక తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తొలి సమరానికి చారిత్రక నగరం వరంగల్ను ఎంచుకున్నారు. ఉద్యమాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఓరుగల్లు గడ్డ నుంచే తన పార్టీ ఎన్నికల ప్రస్థానం మొదలుకానుందని హనుమకొండ వేదికగా కవిత ప్రకటించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలోనూ తమ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని వెల్లడించారు. సరికొత్త పేరు, పాత సెంటిమెంట్ల కలబోతతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ మనుగడను, భవిష్యత్ రాజకీయ బలాన్ని నిర్ణయించే కీలక అగ్నిపరీక్షగా మారనున్నాయి.కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న ఫీజు రీయింబర్స్మెంట్ అంశాన్ని అస్త్రంగా చేసుకుని కవిత రంగంలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న దాదాపు రూ.13వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలనే డిమాండ్తో ఆమె నిరసన బాట పట్టారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన కవిత, అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ని కలిసి వినతిపత్రం అందజేశారు.రాజకీయాల్లో కొత్తగా ఆవిర్భవించిన ఏ పార్టీకైనా క్షేత్రస్థాయి క్యాడర్ బలం, ఓటు బ్యాంక్ నిర్మాణమే అతిపెద్ద సవాలు. కవిత తెలంగాణ రక్షణ సేనను ప్రకటించిన నాటినుంచీ ఆమె రాజకీయ ప్రభావం ఎంతవరకు ఉంటుందనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని డివిజన్లలో పోటీ చేయాలనే నిర్ణయం ఆ పార్టీకి ఒక కత్తిమీద సాము వంటిది.వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే పటిష్టమైన క్యాడర్తో ఉన్నాయి. అలాంటి త్రిముఖ పోటీ వాతావరణంలో టీఆర్ఎస్ తనకంటూ సొంత ఓటు శాతాన్ని రాబట్టుకోగలదా లేదా అన్నది ఈ ఎన్నికల్లోనే తేలిపోనుంది. అన్ని డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించుకోవడమే కవిత వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, బలమైన అసంతృప్త నేతలను తమ వైపు తిప్పుకోవ డంలో పార్టీ ఎంతవరకు సఫలీకృత ˇమవు తుందనేది కీలకం. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ప్రజల్లో సెంటిమెంట్ను రగిలించి, ప్రజా సమస్యల ద్వారా పాలకులపై పోరా డటం ద్వారా తృతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత ఆశిస్తున్నారు.రాష్ట్ర రాజకీ యాల్లో తాము నామమాత్రపు పాత్రధారులం కాదని, ప్రత్యర్థులకు గట్టి సవాలు విసరగల పూర్తిస్థాయి ప్రత్యామ్నాయ శక్తినని నిరూపిం చుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కవితపై ఉంది. వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కవిత కొత్త ప్రస్థానానికి నైతిక స్థైర్యాన్ని ఇస్తాయా, లేక ఎదురీతను తప్పించవా అనేది త్వరలోనే తేలనుంది. ఈ ఎన్నికల వేదికపై తెలంగాణ రక్షణ సేన ప్రదర్శించే ప్రభావమే ఆ పార్టీ భవిష్యత్ రాజకీయ మనుగడను దిశానిర్దేశం చేయనుంది

# రాష్ట్రంలో నిర్బంధ పాలన నడుస్తోంది

సికింద్రాబాద్ రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగుతోందని బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ సామల హేమ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్ ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో బీఆర్ ఎస్ శ్రేణులతో కలసి బోయిన్ పల్లి స్టేషన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ నేతను కలవడం కోసం ఎరవెల్లికి బయలు దీరిన నేతలను అరెస్ట్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు కొడుకు తన తండ్రిని కూడా కలవనియకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తంచేశారు.

# ప్రజా సమస్యలు కాదు... డ్రామాలతో సరి

హైదరాబాద్, సెప్టెంబర్ 10, తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండు రోజుల పాటు సభ లోపల నడవాల్సిన ప్రజా సమస్యల చర్చ కంటే, బయట నడిచిన రాజకీయ హైవోల్టేజ్ డ్రామానే ఊహించని మలుపులు తిరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, నెరవేర్చని ఆరు గ్యారెంటీలు, హామీల వైఫల్యాలపై పక్కా చార్జ్‌షీట్ తో ప్రభుత్వాన్ని శాసనసభ వేదికగా ఎండగట్టాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహం రచించింది. కేటీఆర్, హరీశ్‌రావుల నాయకత్వంలో నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో మీడియా మైలేజ్ సాధించడమే లక్ష్యంగా అసెంబ్లీ గేట్ వద్దకు చేరుకున్నారు. అయితే, ఆరంభంలోనే బీఆర్ఎస్ ఆశించిన పొలిటికల్ మైలేజ్ కాస్తా, కాంగ్రెస్ విసిరిన పక్కా పొలిటికల్ ట్రాప్‌లో పడి పూర్తిగా ఆవిరైపోయింది.అసెంబ్లీ గేటు వద్ద భద్రతా సిబ్బంది ఆంక్షలు విధించడంతో చోటుచేసుకున్న నెట్టివేతలు, తోపులాటల సమయం వరకు బీఆర్ఎస్ వ్యూహం బాగానే అమలైంది. కేటీఆర్, హరీశ్‌రావు సహా ప్రజాప్రతినిధుల అరెస్టులు, మహిళా నేతల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరుపై ప్రతిపక్షం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేసింది. కానీ, నిరసన ఆవేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు మైండ్ గేమ్‌ను ఒక్కసారిగా తిరగరాశాయి. పోలీసులతో వాగ్వాదంలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యవస్థను ఉద్దేశించి ఆయన మాట్లాడారంటూ కాంగ్రెస్ శ్రేణులు వీడియో క్లిప్‌లతో తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగాయి. ఈ ఒక్క అవకాశాన్ని పట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు రాజకీయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సభ లోపల స్పీకర్ భోరున విలపించడం, కాంగ్రెస్ నేతలు దళిత ఆత్మగౌరవ సెంటిమెంట్‌ను రగల్చడంతో అసలు కథ పక్కదారి పట్టింది. ప్రభుత్వంపై రావలసిన 'వెయ్యి రోజుల వైఫల్యాల' చర్చ కాస్తా, బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలు , స్పీకర్ అవమాన ఘటన చుట్టూ తిరిగేలా కాంగ్రెస్ నేతలు నరేటివ్‌ను సెట్ చేయగలిగారు. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన బీఆర్ఎస్, అనూహ్యంగా ఆత్మరక్షణలో పడి వివరణలు ఇచ్చుకునే పరిస్థితికి దిగజారింది.రెండో రోజు పరిణామాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్ రెడ్డిలను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద పోలీసులు మంగళవారం ఉదయాన్నే వారి నివాసాల వద్ద అరెస్ట్ చేయడం కాంగ్రెస్ మైండ్ గేమ్‌లో పరాకాష్టగా నిలిచింది. కేటీఆర్, హరీశ్‌రావులపై కూడా కేసులు నమోదు కావడం, శాసనమండలిలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ పట్టుబట్టడంతో బీఆర్ఎస్ నాయకత్వం డిఫెన్స్‌లో పడిపోయింది. రెండు రోజుల అసెంబ్లీ ఘట్టాలను నిశితంగా పరిశీలిస్తే, ఆరంభంలో హంగామా చేసి మీడియా దృష్టిని ఆకర్షించిన బీఆర్ఎస్, చివరకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా విసిరిన 'సభా సంప్రదాయాలు – దళిత సెంటిమెంట్' అనే ఆత్మరక్షణ ట్రాప్‌లో దారుణంగా చిక్కుకుపోయింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన కీలక సమయాన్ని బీఆర్ఎస్ తమ నేతల అరెస్టులు, క్షమాపణలు, వివరణలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాజకీయాల్లో ప్రత్యర్థులను రెచ్చగొట్టి తప్పులు చేయించడమే అసలైన వ్యూహమైతే, ప్రస్తుత పోరులో అధికార కాంగ్రెస్ విసిరిన గేండ్‌లో బీఆర్ఎస్ దారుణంగా దొరికిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా కేటీఆర్ మీడియా ముందూ, పోలీసుల వద్ద వాడిన తీవ్రమైన, అకోపపూరిత భాష ప్రతిపక్షానికి రాజకీయంగా ఎలాంటి మైలేజ్‌ను అందించలేకపోయింది. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన తొందరపాటు వ్యాఖ్యల వల్లే ఈ వివాదమంతా మొదలైందనే విషయాన్ని కేటీఆర్ పక్కనపెట్టి, అదే స్థాయి ఆక్రోశాన్ని ప్రదర్శించడంతో కథ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారింది. చివరికి, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభా ప్రాంగణం బయట "కేసీఆర్ చావు కోరుకుంటున్నట్లు, ఎర్రవల్లి నివాసానికి చావు డప్పు కొడతామంటూ" చేసిన వికృత వ్యాఖ్యలను సైతం ప్రజాక్షేత్రంలో సెంటిమెంట్‌గా మార్చుకుని సానుభూతి సాధించడంలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైంది. కేటీఆర్ తీవ్రమైన భాషను పక్కనపెట్టి, ప్రజాస్వామ్యయుతమైన శైలితో నిలదీసి ఉంటే.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలపై ప్రజల సానుభూతి పూర్తిగా కేసీఆర్‌కే దక్కేది. కానీ, కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా రగిల్చిన ఆవేశపు ట్రాప్‌లో పడి బీఆర్ఎస్ రెచ్చిపోవడం వల్ల, ప్రత్యర్థి చేసిన పెద్ద తప్పు కూడా కప్పిపోయి.. చివరికి బీఆర్ఎస్‌కే రాజకీయంగా తీవ్ర నష్టం చేకూరింది.

నోరు తెచ్చిన తంటా

తెలంగాణ రాజకీయాల్లో తిట్లు, వ్యంగ్యాస్త్రాలు కొత్త కాదు. కానీ, ఒకప్పుడు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అదే భాష.. ఇప్పుడు బీఆర్ఎస్ మెడకే చుట్టుకుంటోందా? తెలంగాణ ఉద్యమ కాలంలో కేసీఆర్ వాడిన నాటు భాష, యాస ప్రజలను కదిలించి ఒక ఎమోషన్‌ను సృష్టించాయి. అధికారంలో ఉన్నన్నాళ్లూ మా భాషే ఇంత.. ఇది తెలంగాణ మట్టి వాసన అంటూ సమర్థించుకున్నారు. కానీ కాలం మారింది, పాత్రలు మారాయి. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న గులాబీ నేతలు వాడుతున్న ఆవేశపూరిత భాష, నియంత్రణ లేని మాటలు ఆ పార్టీకి శాపాలుగా మారుతున్నట్టు కనిపిస్తోంది.ఉద్యమంలో ఆవేశానికి ఆదరణ దక్కింది. కానీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలు బాధ్యతాయుతమైన ప్రవర్తనను ఆశిస్తారు. ఈ సున్నితమైన తేడాను బీఆర్ఎస్ విస్మరిస్తున్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను ఎండగట్టడానికి బీఆర్ఎస్ ఒక పక్కా చార్జ్‌షీట్‌తో సిద్ధమైంది. నల్ల చొక్కాలు ధరించి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనుకుంది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి అది కాస్తా నోటి దురుసు వల్ల దారితప్పింది.అసెంబ్లీ గేట్ వద్ద నిరసన సందర్భంగా ఉద్రిక్తత, పోలీసుల తోపులాటల వరకు ప్రజల్లో సానుభూతి బీఆర్ఎస్ వైపే ఉంది. కానీ.. ఆ ఆవేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, సభా స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు మొత్తం సీన్ ను మార్చేశాయి. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ దీనిని ఏకంగా దళిత ఆత్మగౌరవ సమస్యగా మార్చేసింది. సభలో స్పీకర్ భావోద్వేగానికి గురికావడం, ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంతో బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై జరగాల్సిన చర్చ కాస్తా.. బీఆర్ఎస్ నేతల భాష, సభా మర్యాదల ఉల్లంఘన చుట్టూ తిరిగేలా అధికార పార్టీ పావులు కదిపింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సంయమనం కోల్పోయారు. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా మీడియా, పోలీసుల సమక్షంలోనే ఆయన ఉపయోగించిన తీవ్రమైన పదజాలం విమర్శలకు తావిచ్చింది. అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టినప్పుడు, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిలబడాల్సింది పోయి.. అదే ఆవేశంతో ఎదురుదాడికి దిగడంతో కాంగ్రెస్ ట్రాప్ లో బీఆర్ఎస్ పడినట్లు కనిపిస్తోంది. షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభా ప్రాంగణం బయట కేసీఆర్ చావు కోరుకుంటున్నామని, ఎర్రవల్లి నివాసానికి చావు డప్పు కొడతామని అత్యంత హేయమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి సానుభూతిగా మార్చుకోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. అప్పటికే బీఆర్ఎస్ నేతల తిట్లు, వివాదాస్పద వ్యాఖ్యలే మీడియాలో, సోషల్ మీడియాలో హెడ్‌లైన్స్‌గా మారడమే ఇందుకు కారణం. ప్రత్యర్థి చేసిన పెద్ద తప్పు కూడా, బీఆర్ఎస్ వాడిన భాష ముందు కొట్టుకుపోయింది.ప్రభుత్వ వైఫల్యాలు, రైతు సమస్యలు, గ్యారెంటీలను గట్టిగా నిలదీసి ప్రజల దృష్టిని ఆకర్షించాల్సిన సమయంలో.. తమ నేతల అరెస్టులు, బెయిళ్లు, కేసులపై వివరణలు ఇచ్చుకోవడానికే బీఆర్ఎస్ కు సమయం సరిపోతోంది. ఎదురుదాడి చేసే క్రమంలో సంస్కారం, హుందాతనం కోల్పోతే ప్రజల్లో సానుభూతి కాస్తా అసహ్యంగా మారుతుందన్న ప్రాథమిక సూత్రాన్ని ఆ పార్టీ విస్మరిస్తోంది.

# కాంగ్రెస్ మైండ్ గేమ్ లో గులాబీ దళం

నల్గొండ, సెప్టెంబర్ 10, వంద కాదు, ఐదువందలు కాదు.. ఏకంగా వెయ్యి రోజుల కాంగ్రెస్ మార్క్ పాలనపై అసెంబ్లీ సాక్షిగా 'ఛార్జ్‌షీట్' దాఖలు చేసి, రేవంత్ ప్రభుత్వాన్ని కడిగిపారేద్దామని గులాబీ బాస్‌లు పక్కా స్కెచ్ వేశారు. నల్ల చొక్కాలు తొడిగి, చేతిలో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ గేటు ముందు కేటీఆర్, హరీశ్‌రావులు దిగిన సీన్ చూసి.. ఇక ఈ వర్షాకాల సమావేశాల్లో 'హైవోల్టేజ్ డ్రామా' ఖాయం, కాంగ్రెస్ వికెట్ పడిపోవడం తథ్యం అని ప్రతిపక్ష శ్రేణులు తెగ మురిసిపోయాయి. తీరా కట్ చేస్తే.. అసలు కథ వేరేలా మారింది!ప్రభుత్వ వైఫల్యాలు, ఆరు గ్యారెంటీల బాకీల గురించి గళమెత్తాల్సిన చోట.. 'తాతా మధు' నోటి దురద పుణ్యమా అని కథ మొత్తం రివర్స్ తిరిగింది. పోలీసులతో తోపులాటలో ఆవేశం ఆపుకోలేక ఎమ్మెల్సీ గారు విసిరిన ఒక్క మాటతో.. కాంగ్రెస్‌కి బిగ్ ఆఫర్ దొరికినట్లయింది. "దళిత స్పీకర్‌ను అవమానిస్తారా?" అంటూ హస్తం నేతలు సెంటిమెంట్ కార్డు తీసి జనం మీదికి వదిలారు. ఇక అంతే! సభలో స్పీకర్ గారు కన్నీళ్లు పెట్టుకోవడం, కాంగ్రెస్ నేతలు 'దళిత ఆత్మగౌరవం' అంటూ రచ్చ చేయడం.. దీంతో బీఆర్ఎస్ తెచ్చిన 'వెయ్యి రోజుల వైఫల్యాల' అజెండా గాల్లో కలిసిపోయింది. ప్రభుత్వాన్ని కార్నర్ చేయాల్సిన గులాబీ నేతలు, చివరికి తమ నేత నోటిజారుడుకు సఫాయిలు చెప్పుకోవాల్సిన దయనీయ స్థితికి పడిపోయారు.రెండో రోజు సీన్ ఇంకా రసవత్తరంగా మారింది. అర్ధరాత్రి అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు డిమాండ్లు.. ఇలా సీన్ మొత్తం బీఆర్ఎస్ నేతలకు ఊపిరాడకుండా చేసింది. ఇక సీఎం రేవంత్‌పై కేటీఆర్ గారు పెంచిన "డోస్" ఏమైనా వర్కవుట్ అయిందా అంటే.. అదీ లేదు! ప్రత్యర్థిని దెబ్బకొట్టబోయి తామే మరింత ఆవేశపడి, కాంగ్రెస్ నేతల చేతికి మరో ఆయుధాన్ని అందించారు.మరోవైపు, షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం బీఆర్ఎస్‌కు పక్కా "గోల్డెన్ ఛాన్స్". దాన్ని పట్టుకుని జనాల్లో సానుభూతి పిండుకోవాల్సిన చోట.. కేటీఆర్ కంపెనీ ఆవేశంలో ఊగిపోయి ఆ అవకాశాన్ని నీళ్లపాలు చేసుకుంది.మొత్తానికి 'ఛార్జ్‌షీట్' పట్టుకుని కాంగ్రెస్‌ను కడిగేద్దామని వచ్చిన బీఆర్ఎస్.. చివరకు స్టేషన్ల చుట్టూ, కేసుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకుంది. ప్రత్యర్థిని ఆవేశంలో ముంచి తప్పు చేయించడంలో కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్ వర్కవుట్ అయితే.. ఉన్న అవకాశాలను వదిలేసుకుని గులాబీ దళం భలే 'సెల్ఫ్‌గోల్' వేసుకుందంటూ రాజకీయ విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు!

# బీఆర్ఎస్ నేతలు బుద్ధి మార్చుకోకపోతే... ప్రజలే మిమ్మల్ని శుద్ధి చేస్తారు

**దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం, కాదు ముందు మీ మైండ్ ను శుద్ధి చేసుకోండి**

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

హైదరాబాద్ కేసీఆర్ దగ్గర మార్కుల కోసం, కేటీఆర్, హరీష్ రావు పోటీ పడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరీ వెంకట్ ఆరోపించారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు.



హరీశ్ రావు, కేటీఆర్ దగ్గర మార్కుల కోసం, వాళ్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోటీ పడి, పోలీసులపై దాడి చేశారు. స్పీకర్ పై కూడా దూషణలకు దిగారు. కేసీఆర్ డైరెక్షన్లో ఇదీ ఃఖీూ నేతల వ్యవహారం నడుస్తోంది. తప్పులు చేయడం, తప్పించుకునే ప్రయత్నం చేయడం. మళ్ళీ అవన్నీ ఏఐ కంటెంట్ బి అంటూ చెప్పుకోవడానికైనా సిగ్గు ఉండాలని అన్నారు. అసెంబ్లీ గేట్ దగ్గర బీఆరెస్ నేతల చేసిన రౌడీ, రాక్షస చర్య లైవ్ ఇ లో యావత్ సమాజం చూసింది ఖండించింది. అయినా... ఆ పార్టీ నేతల్లో ఏ మాత్రం పశ్చాతాపం కనిపించడం లేదు ఫామ్ హౌస్ దగ్గర దళితులు ధర్నా చేస్తే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం, కాదు ముందు మీ మైండ్ ను శుద్ధి చేసుకోండి. మీ తీరు, మాటలు చూసి జనం సిగ్గు పడుతున్నారు. ఇలాంటి నేతలనా..? మనం అసెంబ్లీకి పంపించిదని బాధ పడుతున్నారు. పబ్లిక్ గా చేసిన తప్పును, కూడా సమర్థించుకునే, ప్రయత్నం చేయడం సిగ్గు చేటు. మీ తీరు మార్చుకోకపోతే ప్రజలే మీ మైండ్ ను శుద్ధి చేస్తారని అన్నారు.

# సొంత ప్రభుత్వంపై 'రాములమ్మ' నిప్పులు!'

**మేము పోరాడకుంటే మీరు సీఎంలు, మంత్రులు అయ్యేవారా?**

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**

**శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ధ్వజం**

తెలంగాణ శాసన మండలి వేదికగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ విజయశాంతి తన సొంత ప్రభుత్వంపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరిపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మండలి సమావేశాల్లో భాగంగా జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని అగ్రహం వ్యక్తం చేశారు. ×ఉద్యమకారులు లేకపోతే మీ పదవులు ఎక్కడివి?×సభలో విజయశాంతి తన మార్క్ యాక్షన్ స్టైల్‌లో ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "తెలంగాణ ఉద్యమకారులు నాడు రోడ్లపైకి వచ్చి, లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లకుంటే ఈరోజు ప్రత్యేక రాష్ట్రం వచ్చేదా? ఆనాడు వారు చేసిన పోరాటం వల్లే కదా ఇవాళ మీరు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. ఆ ఉద్యమకారులను విస్మరిస్తే ఊరుకునేది లేదు" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, ప్రభుత్వ పెన్షన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ×ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై 'క్వాలిటీ' అస్త్రం..×ఉద్యమకారుల అంశంతో పాటు రాష్ట్రంలో పేద ప్రజారోగ్యంపై విజయశాంతి ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్నాయని మండిపడ్డారు. ఆరోగ్య రంగంలో ప్రభుత్వం 'క్వాలిటీ' (నాణ్యత) పెంచాల్సిన అవసరం ఉందని, వైద్య సేవలు అందక పేదలు అల్లాడుతుంటే చూస్తూ ఊరుకోలేమని స్పష్టం చేశారు. స్వపక్షాన్ని ఉద్దేశించి ఆమె చేసిన ఈ సంచలన వ్యాఖ్యలతో సభ ఒక్కసారిగా నిశ్శబ్దంలో మునిగిపోయింది. ప్రతిపక్ష సభ్యులు సైతం రాములమ్మ వ్యాఖ్యలకు మద్దతుగా డెస్కులు చరిచారు. మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను సొంత పార్టీ ఎమ్మెల్సీయే ఎండగట్టడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# విశాఖపట్నం పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ ను కలిసిన డాక్టర్ సృజనా దేవి

విశాఖపట్నం: వైద్య, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందిస్తూ అందాల పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విశాఖపట్నానికి చెందిన ప్రముఖ అనస్థీషియా వైద్యురాలు డాక్టర్ ఎం. సృజనా దేవి "ఫరెవర్ మిస్ యూనివర్స్ ఇండియా 2025" టైటిల్‌ను కైవసం చేసుకోవడం పై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.. రాజస్థాన్‌లోని జైపూర్‌లో 'ఫరెవర్ స్టార్ ఇండియా' (ఈఎం) నిర్వహించిన జాతీయ స్థాయి ఆఖరి ఘట్టంలో దేశవ్యాప్తంగా పాల్గొన్న వేలాది మంది పోటీదారులను వెనక్కి నెట్టి ఆమె ఈ విజయాన్ని సొంతం చేసుకోవడం గొప్ప విషయం అన్నారు.ఈ సందర్భంగా విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ని డాక్టర్ సృజనా దేవి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. డాక్టర్ సృజనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... "వైద్యురాలిగా, సామాజిక కార్యకర్తగా ఇప్పటికే సమాజంలో తనదైన ముద్ర వేసిన డాక్టర్ సృజనా దేవి, మోడలింగ్, ఫ్యాషన్ రంగంలో జాతీయ స్థాయిలో కిరీటం గెలుచుకోవడం ఎంతో అభినందనీయం. మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటూ అద్భుత విజయాలు సాధించడం రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం. భవిష్యత్తులో సృజనా దేవి మరిన్ని అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను." అన్నారు.మంత్రి దుర్గేష్ ను కలిసిన వారిలో ఏపీ ఛాంబర్స్ సలహాదారు లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎం. వి.పవన్ కార్తీక్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.వి.స్వామి ఉన్నారు..

# బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ వద్ద కారులో ఒక్కసారిగా మంటలు

## టెస్ట్ డ్రైవింగ్‌కు వెళ్తుండగా పొగలు.. క్షణాల్లో దగ్ధమైన కారు

విజయవాడ: నగరంలోని బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ సమీపంలో, జ్యోతి కన్వెన్షన్ ఎదురుగా గురువారం ఉదయం కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అంబిర్కా డీజిల్ మెకానిక్ కార్స్ షోరూమ్ నుంచి టెస్ట్ డ్రైవింగ్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.కారు ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడంతో పక్కనే ఉన్న వ్యక్తి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే డ్రైవర్ కారు ఆపి డోర్ తీసుకుని బయటకు వచ్చేలోపే కారులో మంటలు చెలరేగాయి. దీంతో కారు కొద్దిసేపటికే పూర్తిగా దగ్ధమైంది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది కూడా హుటాహుటిన అక్కడికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.ప్రమాద సమయంలో డ్రైవర్ సకాలంలో బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటన కారణంగా ఫ్లైఓవర్‌పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, ట్రాఫిక్ పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు.సకాలంలో స్పందించిన పోలీసు, ట్రాఫిక్ పోలీసు మరియు అగ్నిమాపక సిబ్బంది చర్యలతో పెద్ద ప్రమాదం తప్పింది

# సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్న సమంత..

# రాజ్ నిడిమోరు ఆపింది ఇలానే!

**మయోసైటిస్‌తో ఏడాది పాటు సినిమాలకు దూరమైన సమంత**

**వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టిన స్టార్ హీరోయిన్**

**'మా ఇంటి బంగారం'తో నిర్మాణ రంగంలోకి అడుగు**

**కెరీర్ కొనసాగించాలని రాజ్ నిడిమోరు ప్రోత్సాహం**

**సెట్‌లో రాజ్ ఉండటం ధైర్యమిచ్చిందని సమంత వెల్లడి**

సినీ కెరీర్‌కు దాదాపు ముగింపు పలకాలని ఓ దశలో స్టార్ హీరోయిన్ సమంత భావించారట. అనారోగ్య సమస్యలతో ఏడాది పాటు విరామం తీసుకున్న ఆమె.. ఇక నటనకు దూరంగా ఉండాలని అనుకుంది. అయితే ఆమె భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరు మాత్రం అందుకు అంగీకరించలేదు. తనపై ఆయన పెట్టుకున్న నమ్మకమే మళ్లీ కెమెరా ముందుకు వచ్చే ధైర్యాన్ని ఇచ్చిందని సమంత తాజాగా వెల్లడించింది.



ఓ ఇంటర్వ్యూలో సమంత తన జీవితంలోని ఆ దశను గుర్తు చేసుకుంది. ఏడాది పాటు విరామం తీసుకున్న తర్వాత ఇతర పనులు చేయాలని అనిపించిందని చెప్పింది. ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్న సూచనను సీరియస్‌గా తీసుకున్నానని తెలిపింది. తనకు నచ్చిన పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టానని, అలా 'సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్'గా మారానని చెప్పింది.

అదే సమయంలో 'సిటాడెల్' షూటింగ్ చేయాల్సి వచ్చింది. అనారోగ్యంతో షూటింగ్ చేయడం తనకు అంత సౌకర్యంగా అనిపించలేదని సమంత చెప్పింది. తన కోసం చిత్రబృందం ఎదురుచూడటం, వారి సమయం వృథా కావడం ఇష్టం లేకపోయిందని పేర్కొంది. దీంతో నటనకు బదులుగా 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది.

అయితే రాజ్ నిడిమోరు ఆమె నిర్ణయాన్ని మార్చేశాడు. "ఆయనకు నాపై నాకంటే ఎక్కువ నమ్మకం ఉన్నట్టుంది. సెట్‌లో ఆయన ఉండటం నాకు ధైర్యం ఇచ్చింది" అని సమంత చెప్పింది. తాను దాదాపు కెరీర్ వదిలేయాలని నిర్ణయించుకున్నానని, 'సిటాడెల్' బృందానికి ఈ విషయంపై మెయిల్ కూడా పంపానని వెల్లడించింది.

'మా ఇంటి బంగారం'లో తొలుత సాయిపల్లవిని అనుకున్నారట. ఆమె నటించేందుకు నిరాకరించడంతో సమంత ఆ ప్రాజెక్టులోకి వచ్చింది. కథలో మంచి సామర్థ్యం ఉందని భావించి అది తెరపైకి రావాలని నిర్ణయించుకున్నానని ఆమె తెలిపింది.

సమంతకు 2022లో మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆమె తన ఆరోగ్య పరిస్థితిపై పలు సందర్భాల్లో మాట్లాడింది. ప్రస్తుతం మళ్లీ వరుస ప్రాజెక్టులతో ఆమె సినిమాల్లో యాక్టివ్‌గా మారింది.

# ఈ ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి వస్తున్న మూవీస్ ఇవే!

**సూర్య హీరోగా రూపొందిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'**

**ఈ నెల 11వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్**

**11వ తేదీనే అమెజాన్ ప్రైమ్ లో రానున్న 'మకుటం'**

**విశాల్ డైరెక్ట్ చేసిన యాక్షన్ మూవీ ఇది**

**అదే రోజున స్ట్రీమింగ్ కి వస్తున్న మలయాళ మూవీ 'వరవు'**

**'జీ 5' ద్వారా పలకరించనున్న కంటెంట్**



ప్రతి ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి కొన్ని సినిమాలు దిగిపోతూనే ఉన్నాయి. తమిళ .. మలయాళ సినిమాలు, తెలుగు ఆడియోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అలా ఈ వారం ఇక్కడ వాలిపోయిన సినిమాల జాబితాలో, ముందుగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కనిపిస్తుంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, సూర్య – మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించారు. ఆగస్టు 14వ తేదీన విడుదలైన ఈ సినిమా, 250 కోట్లకి పైకి వసూళ్లను రాబట్టింది. ఈ నెల 11వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో ఐదు భాషల్లో అందుబాటులోకి రానుంది.

విశాల్ హీరోగా నటించిన 'మకుటం' సినిమా కూడా ఈ నెలలోనే ఓటీటీకి వచ్చేస్తోంది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ యాక్షన్ డ్రామా, ఆగస్టు 14వ తేదీన థియేటర్లకు వచ్చింది. విశాల్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాలో, ఆయన సరసన నాయికలుగా అంజలి .. దుషారా విజయన్ అలరించారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' ఓటీటీకి రావడానికి సిద్ధమవుతోంది. ఇది విశాల్ దర్శకత్వం వహించిన సినిమా కావడం మరో విశేషం.

ఇక మలయాళం నుంచి 'వరవు' అనే సినిమా కూడా ఈ నెల 11వ తేదీన బరిలోకి దిగిపోతోంది. 'జీ 5' వారు ఈ సినిమా ఓటీటీ హక్కులను దక్కించుకున్నారు. షాజీ కైలాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, జోజు జార్జ్ కథానాయకుడిగా నటించాడు. మిగతా ముఖ్యమైన పాత్రలలో, మురళి గోపి .. అర్జున్ అశోకన్ .. దీపక్ పరంబోల్ కనిపించనున్నారు. జులై 16న థియేటర్లకు వచ్చిన ఈ సినిమాకి, పాజిటివ్ టాక్ వచ్చింది. మరో ఓటీటీ వైపు నుంచి ఏ స్థాయిలో సందడి చేస్తుందనేది చూడాలి.

# 'ఎపిక్' దాదాపు నా జీవిత కథే.. కానీ ఆ ఒక్కటి జరగలేదు: ఆనంద్ దేవరకొండ

**ఒక్కటి తప్ప 'ఎపిక్' సినిమా కథ నా జీవితంలో జరిగిందన్న ఆనంద్ దేవరకొండ**

**లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నా ఫ్యామిలీతో చూసేలా ఉంటుందని హామీ**

**అన్న విజయ్, వదిన రష్మిక తనకు అండగా ఉంటారని వెల్లడి**

**'తక్షకుడు' అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడిగా నటించనున్నట్టు ప్రకటన**

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు.



"నేను ఒక బాధ్యత గల నటుడిని. నేను ఎంచుకునే కథలు కూడా అదే రీతిలో ఉంటాయి. ఈ సినిమా వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు వంటి అంశాల మేళవింపుగా సాగే ఈ చిత్రం హీరో–విలన్ల మధ్య నడిచే కథ కాదు.. ఇదొక అందమైన ప్రయాణం," అని ఆయన పేర్కొన్నారు. తాను అమెరికాలో చదువుకున్నప్పటి అనుభవాలకు, లండన్ నేపథ్యంలో సాగే ఈ కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని తెలిపారు. "విదేశాల్లో కుటుంబానికి దూరంగా ఉంటూ, ఆర్థిక సమస్యలను అధిగమించి స్థిరపడాలనుకునే ఎంతోమంది యువతకు ఈ కథ కనెక్ట్ అవుతుంది. సినిమాలో హీరో ఓ అమ్మాయితో కలిసి నివసిస్తాడు. నా నిజ జీవితంలో ఆ ఒక్కటి మినహా, మిగిలినదంతా నా కథే" అని ఆనంద్ వివరించారు.

లివ్–ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నప్పటికీ, దర్శకుడు ఆదిత్య హాసన్ ఎక్కడా ఇబ్బందికరంగా లేకుండా, కుటుంబ ప్రేక్షకులు సైతం వీక్షించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణంగా ఇంట్లో సినిమా విషయాలు పెద్దగా చర్చించుకోమని, అయితే తన సోదరుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తనకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇటీవల తనకు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు వారు వాచీలను బహుమతిగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ప్రస్తుతం తాను 'తక్షకుడు' అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడి పాత్రలో నటిస్తున్నానని, అలాగే మరో ఇండో–కొరియన్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తన భవిష్యత్ చిత్రాల గురించి వెల్లడించారు.

# ఊహకందని మలుపులతో ఉక్కిరిబిక్కిరిచేసే 'అనోమి' .. ఓటీటీలో!

**మలయాళంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్**

**ప్రధానమైన పాతను పోషించిన భావన**

**పోలీస్ ఆఫీసర్ గా మెప్పించిన రెహ్మాన్**

**అక్కాతమ్ముళ్ల ఎమోషన్స్ చుట్టూ తిరిగే కథ**

**ఆగస్టు 27 నుంచి జరుగుతున్న స్ట్రీమింగ్**

మలయాళ సైకలాజికల్ థ్రిల్లర్ ఒకటి ఇప్పుడు ఓటీటీలో తన జోరు చూపిస్తోంది. ఆడియన్స్ గెస్ చేయలేని మలుపులతో దూసుకుపోతోంది. అడుగడుగునా ఆసక్తిని పెంచుతూ వెళుతున్న ఆ సినిమా పేరే 'అనోమి'. భావన ప్రధానమైన పాత్రను పోషించిన సినిమా ఇది. రియాస్ మారథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, థియేటర్స్ వైపు నుంచి యావరేజ్ టాక్ నే రాబట్టుకుంది.




అయితే ఓటీటీలో అడుగుపెట్టిన దగ్గర నుంచి ఒక రేంజ్ లో తన సత్తా చాటుకుంటోంది.

'జారా' ఫోరెన్సిక్ నిపుణురాలు. తన పనిలో ఆమె మంచి నైపుణ్యాన్ని కనబరుస్తూ ఉంటుంది. ఆధారాల సేకరణ విషయంలో ..రిపోర్ట్ విషయంలోను ఆమె చాలా స్ట్రిక్ట్ గా ఉంటుంది. అలాంటి ఆమె తమ్ముడు కనిపించకుండాపోతాడు. అందుకు కారణం ఎవరు? ఏమిటి?అనేది ఆమెకి అర్థం కాదు. అలాంటి పరిస్థితులలో ఆమె పోలీస్ ఆఫీసర్ మొహ్మద్ గిబ్రాన్ ను ఆమె సంప్రదిస్తుంది. రంగంలోకి దిగాడంటే ఆ కేసు అంతు చూడకుండా వదలడనే పేరు అతనికి ఉంటుంది. గిబ్రాన్ కి అప్పగించాం కదా అని 'జారా' చూస్తూ కూర్చోదు. తాను కూడా అన్వేషణ కొనసాగిస్తూ ఉంటుంది. అప్పుడు ఆమెకి ఎలాంటి భయంకరమైన నిజాలు తెలుస్తాయి? అప్పుడు ఆమె ఏం చేస్తుంది? అనేదే కథ. క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తిస్తూ సాగిపోయే ఈ సినిమాకి ఆడియన్స్ చాలా ఫాస్టుగా కనెక్ట్ అవుతున్నారు. ఆగస్టు 27వ తేదీ నుంచి ఈ సినిమా ' లైన్స్ గేట్ ప్లే'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఆల్రెడీ అమెజాన్ ప్రైమ్ లోను అందుబాటిలో ఉంది. త్వరలోను తెలుగులోనూ అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది.

## హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో షాద్ నగర్ లో విలేకరుల సమావేశం..

షాద్ నగర్ క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు ఆధునిక సాంకేతికతతో మరింత ఖచ్చితమైన చికిత్స సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు డా. రాజేష్ గౌడ్. క్యాన్సర్ శస్త్రచికిత్స రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని సీనియర్ శస్త్ర చికిత్స నిపుణుడు, రోబోటిక్ శస్త్ర వైద్యుడు డా. రాజేష్ గౌడ్ అన్నారు. క్యాన్సర్‌ను తొలగించడంతో పాటు రోగి జీవన నాణ్యతను కాపాడటమే ఆధునిక చికిత్సల ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్‌లోని దేవి గ్రాండ్ సమావేశ హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత దశాబ్ద కాలంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా చిన్న రంధ్రాల ద్వారా ఆపరేషన్లు నిర్వహించే అవకాశం ఉండటంతో రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళల్లో గర్భాశయ, అండాశయ క్యాన్సర్లతో పాటు రొమ్ము క్యాన్సర్ చికిత్సలోనూ ఆధునిక పద్ధతులు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రోస్టేట్, మూత్రాశయ, మూత్రపిండాల క్యాన్సర్ల చికిత్సలోనూ రోబోటిక్ శస్త్రచికిత్సలు కీలకంగా మారుతున్నాయని అన్నారు. మూత్రపిండ క్యాన్సర్‌లో కణితి ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి ఆరోగ్యకరమైన భాగాన్ని కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. పెద్దపేగు, మలద్వార, ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సలోనూ చిన్న కోతలతో శస్త్రచికిత్సలు నిర్వహించే ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రత్యేక కాంతి సహాయంతో క్యాన్సర్ ప్రభావిత కణజాలం, శోషరస మార్గాలను గుర్తించే సాంకేతికతతో శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వం సాధించే అవకాశం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతికతలతో భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్స మరింత సమర్థవంతంగా మారుతుందని డాక్టరు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు లలిత్ శర్మ, దయశ్వర్ తదితరులు ఉన్నారు.

# 'టాక్సిక్' ఫలితంపై యశ్ స్పందన.. ఏమన్నారంటే?

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్' చిత్ర ఫలితంపై ఆయన స్పందన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. యశ్ సన్నిహితుడైన జైదేవ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, సినిమా విడుదల అనంతరం తాను యశ్‌తో రెండుసార్లు మాట్లాడానని వెల్లడించారు. ఆ సంభాషణలో యశ్ ఏమన్నారో జైదేవ్ వివరించారు.

జైదేవ్‌తో యశ్ మాట్లాడుతూ, "సినిమా ఫలితం గురించి ఆందోళన చెందవద్దు. దాన్ని ప్రేక్షకుల నిర్ణయానికే వదిలేద్దాం. రాబోయే రోజుల్లో మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి" అని పేర్కొన్నట్లు జైదేవ్ తెలిపారు. యశ్ ధైర్యంగా ఈ మాటలు చెప్పినప్పటికీ, ఆయన గొంతులో మాత్రం స్వల్ప నిరాశ కనిపించిందని జైదేవ్ అభిప్రాయపడ్డారు.

సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ప్రేక్షకుల తీర్పే అంతిమమని జైదేవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం యశ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చనీయాంశమయ్యాయి. తదుపరి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న యశ్ నిర్ణయాన్ని అభిమానులు హర్షిస్తున్నారు.

# అసురక్షిత భవనాలను వెంటనే ఖాళీ చేయించాలి

## (హెచ్.ప్రతాప్)

ఒక భవనం బలహీనంగా ఉందని తెలిసిన తర్వాత కూడా అందులో మనుషులను నివసింపజేయడం నిర్లక్ష్యం మాత్రమే కాదు, తీవ్రమైన జవాబుదారీతన లోపం. ముఖ్యంగా పురాతన గృహాలు, కాలం చెల్లిన అపార్ట్మెంట్లు, భవన సముదాయాలు, విద్యార్థులు, బాలలు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉండే వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల భద్రత విషయంలో ఏమాత్రం రాజీ ఉండకూడదు. ప్రమాదం జరిగిన తర్వాత నష్టపరిహారం ప్రకటించడం కంటే, ప్రమాదం జరగకముందే ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత.

దేశవ్యాప్తంగా పాత భవనాలు, నిర్మాణపరమైన లోపాలు, నిర్వహణ లోపాలు, అధిక వినియోగం వంటి కారణాలతో ప్రమాదాల ముప్పు పొంచి ఉన్న భవనాలు అనేకం ఉన్నాయి. బయటకు భవనం సాధారణంగానే కనిపించినా, పునాదులు, స్తంభాలు, పైకప్పులు, గోడలు, మెట్లు, విద్యుత్ వ్యవస్థలు వంటి కీలక భాగాల్లో బలహీనతలు ఉండవచ్చు. వర్షాలు, వరదలు, తేమ, అధిక భారం వంటి పరిస్థితులు ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతాయి.

అందువల్ల ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఆసుపత్రులు, కార్యాలయాలపై ప్రత్యేక భద్రతా తనిఖీలను తక్షణమే చేపట్టాలి. ఈ తనిఖీలను సంబంధిత శాఖల సాధారణ సిబ్బందితో మాత్రమే కాకుండా, నిర్మాణ నిపుణులు, సివిల్ ఇంజినీర్లు, అగ్నిమాపక భద్రతా నిపుణులు, విద్యుత్ భద్రతా అధికారులు వంటి సమర్థ సంస్థల ద్వారా స్వతంత్రంగా నిర్వహించాలి.

ప్రతి భవనాన్ని మూడు కేటగిరీలుగా వర్గీకరించడం అవసరం---సురక్షితమైనవి, తక్షణ మరమ్మతులతో వినియోగించదగినవి, పూర్తిగా అసురక్షితమైనవి. అసురక్షితంగా గుర్తించిన భవనాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నివాసం లేదా కార్యకలాపాలను కొనసాగించకూడదు. అక్కడ ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇతరులను వెంటనే ప్రత్యామ్నాయ సురక్షిత భవనాలకు తరలించాలి. మరమ్మతులు అవసరమైన భవనాలకు స్పష్టమైన గడువు విధించి పనులు పూర్తి చేయాలి.

ఇక్కడ మరో కీలక అంశం జవాబుదారీతనం. తనిఖీలు నిర్వహించడం మాత్రమే కాకుండా, నివేదికలను బహిరంగపరచడం, లోపాలపై చర్యలు తీసుకోవడం, నిర్ణీత గడువులో మరమ్మతులు పూర్తయ్యేలా పర్యవేక్షించడం కూడా తప్పనిసరి. ప్రమాద సూచనలు ముందే కనిపించినా అధికారులు పట్టించుకోకపోతే, భవిష్యత్తులో జరిగే నష్టానికి బాధ్యత ఎవరిదో కూడా స్పష్టంగా నిర్ణయించాలి.ప్రభుత్వ పోర్టల్ లో ఈ వివరాలన్నింటినీ పొందుపరచాలి.

భవనాల భద్రతకు ధ్రువీకరణ పత్రం ఒకసారి తీసుకుని శాశ్వతంగా సరిపోతుందని భావించకూడదు. నిర్ణీత కాల వ్యవధిలో పునఃతనిఖీలు నిర్వహించే శాశ్వత వ్యవస్థ అవసరం. ప్రజా భవనాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించి, వాటి వినియోగంపై కఠిన పర్యవేక్షణ ఉండాలి. ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో, ప్రజలు ఇప్పటికే ఉపయోగిస్తున్న భవనాల భద్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక వంతెన, ఒక రహదారి, ఒక భవనం తిరిగి నిర్మించవచ్చు; కానీ కోల్పోయిన ప్రాణాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేం.

కాబట్టి ప్రమాదం కోసం ఎదురుచూడకుండా, అనుమానం ఉన్న ప్రతి భవనాన్ని ఇప్పుడే తనిఖీ చేయాలి. అసురక్షితంగా తేలిన ప్రతి వసతి గృహాన్ని, ప్రతి ప్రజా భవనాన్ని తక్షణమే ఖాళీ చేయించి సురక్షిత ప్రత్యామ్నాయం కల్పించాలి. ప్రాణాలను కాపాడే ముందస్తు చర్యే ప్రభుత్వానికి నిజమైన పరీక్ష; విషాదం తర్వాత స్పందించడం కాదు.

# ఫీజుల బకాయిలు చెల్లించవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం

**స్థానిక సంస్థలలో జడ్పిటిసి/ఎంపిటిసి ఎన్నికలకు 42 శాతం**

**బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలి**

**బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం నిర్ణయం**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 10: ఫీజుల బకాయిలు చెల్లించే వరకు బీసీ విద్యార్థుల ఉద్యమాన్ని కొనసాగిస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ట్కృష్ణయ్యపిలుపునిచ్చారు.గురువారం జరిగిన కోర్ కమిటీ సమావేశానికి జాతీయ సంక్షేమ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్అధ్యక్షత వహించారు.



సమావేశానికి ముఖ్య అతిధిగా వచ్చిన కృష్ణయ్య మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు ఇచ్చే స్కాలర్ షిప్పులు, ఫీజుల పట్ల ముఖ్యమంత్రికి ఎంత వ్యతిరేకత ఉండరాదని దీనిని మార్చుకోవాలని హెచ్చరించారు. ఫీజులు, స్కాలర్షిప్ల రాక గత రెండు సంవత్సరాలు కోర్స్ పూర్తి చేసిన 6 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలో ఉన్నవి. ఫీజుల స్కీము పై ఏర్పడిన గందరగోళం వలన 30 వేల మంది ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ కు హాజరు కాలేదు. అలాగే పిజి అడ్మిషన్లు లో ముఖ్యంగా వీదీూ – వీజూా అడ్మిషన్లలో 50 శాతం సీట్లు భర్తీ కాలేదు. కట్టే స్తోమత లేకపోవడం వలన అడ్మిషన్లు తీసుకోవడం లేదు. అదే విధంగా డిగ్రీ కాలేజిలో కుడా 70వేల సీట్లు మిగిలిపోయాయి. అందుకే పాత పద్ధతినే యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆనంతయ్య,రాజేందర్.సంఘం సీనియర్ నాయకులు అల్లం యాదయ్య,నిఖిల్ పటేల్,బాలయ్య,తో పాటు పలు బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విజయ దుర్గ మాత దేవాలయ ప్రాంగణంలో ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 10: శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలోని వాసవి వనిత క్లబ్ ఎల్లారెడ్డిగూడ విభాగం ప్రెసిడెంట్ అనిత సహకారంతో స్థానిక శ్రీ విజయ దుర్గ మాత పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళా భక్తులు శాస్త్రోక్తంగా దీపారాధన, కలశస్థాపన, గణపతి పూజ, గౌరీపూజ, నవగ్రహ ఆరాధన నిర్వహించారు.




అనంతరం భక్తులు పుట్టమన్నుతో 108 పార్థివ లింగాలను స్వయంగా తయారు చేసి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చనలతో విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో పూజాదికాలు నిర్వహించిన బాసర అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతు.. బాసర క్షేత్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం ఈశాన్య భాగంలో కోటి పార్థివలింగ స్తూపాన్ని నిర్మించామని తెలిపారు.

భక్తులు తయారు చేసిన ఈ శివలింగాలను ఆ స్తూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్థివ లింగాల తయారీకి ఆసక్తి గల మహిళా బృందాలు 9948332032 నంబరును సంప్రదిస్తే ఉచితంగా పుట్టమన్నును అందజేసి పూజాదికాలు చేయిస్తామని వెల్లడించారు. బాసర సరస్వతి క్షేత్రం లో మాసోత్సవం సందర్భంగా 20న ప్రత్యేక పూజలు ,హోమములు ,గో పూజ, మహా అన్నదానం ,మరియు భరతనాట్యము కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని ఆసక్తిగల నాట్యగురువులు 9948332032 సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు

# అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తో బీసీ సంఘాల బృందం భేటీ

**జాతీజనగణలో ఓబీసీ కాలం చేర్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలి..జాజుల**

**సంచార జాతుల విముక్తి దినోత్సవం రాష్ట్ర పండుగగా జరపాలి**

**బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ సెప్టెంబర్ 10: అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తో బీసీ సంఘాల బృందం కలిసింది.ఈ సందర్భంగా జాతీజనగణలో ఓబీసీ కాలం చేర్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజు శ్రీనివాస్ నేతృత్వం లో ప్రతినిధుల బృందం ముఖ్య మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవం రాష్ట్ర పండుగగా జరపాలని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కోరారు.అలాగే

ఈ నెలలో హైదరాబాదులో జరిగే సంచార జాతుల విముక్తి దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరారు.సీఎంతో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను బృందం కలిసి విజ్ఞప్తి చేసింది.ఈ భేటీలో వద్దెర ఫెడరేషన్ చైర్మన్ గుంజ రేణుక, సంచార జాతుల సంఘాల నేతలు కాటేపల్లి వీరస్వామి, తిప్పిరి శెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు..



హైదరాబాద్ బిఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సుధీర్ రెడ్డి, నవీన్ రెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తమతో అసభ్యంగా ప్రవర్తించారని మహిళా కానిస్టేబుల్ హైదరాబాద్ లోని సైఫాబాద్ పిఎస్ లో ఫిర్యాదు చేశారు.టీషర్టులు విప్పి తమ ముందు అర్ధనగ్నంగా నిలబడ్డారని అందులో పేర్కొన్నారు. దీంతో వారిపై బిఎన్ఎస్ 74, 75(1), 79, 121(1), 130, 132, 296, 351(2), 352, 3(5) సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు.

# అనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై: బీఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి చెందిన సంస్థకు కేటాయించిన భూములను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించింది. భూముల కేటాయింపు జరిగిన ప్రాంతానికి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు అక్కడి నుంచే మీడియాతో మాట్లాడి ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు చేశారు.రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించారంటూ ఆరోపణ, సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టారని విమర్శించారు. విలువైన ప్రభుత్వ భూముల కేటాయింపుపై సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి అన్నదమ్ములకు నో రూల్స్ అంటూ కేటీఆర్ విమర్శలుఅనుముల బ్రదర్స్ భూ వ్యవహారంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. లక్ష రూపాయల చెల్లింపు మూలధనంతో, కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని సంస్థకు ఇంత విలువైన రక్షణ రంగ ప్రాజెక్టు భూమిని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఒక రకమైన నిబంధనలు, సామాన్య ప్రజలకు మరో రకమైన నిబంధనలు అమలు చేస్తున్నారనే భావన కలుగుతోందని విమర్శించారు.

ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో భూముల దందా:

హరీశ్‌రావు

ఫోర్త్ సిటీ అభివృద్ధి పేరుతో వెనుకబడిన ప్రాంతాల భూములను ప్రభుత్వం సేకరిస్తూ, వాటిని సంస్థల ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. షెల్ కంపెనీల పేరుతో బంధువుల రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని విమర్శించారు.ప్రభుత్వ భూముల కేటాయింపులు, వాటి వెనుక ఉన్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నిరుపేదల భూములు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగించడంతో పాటు న్యాయపరంగానూ ముందుకు వెళ్తుందని వారు స్పష్టం చేశారు.

# దయగల దాతలు ఆదుకోండి..!

## బ్రెయిన్ ట్యూమర్‌తో తల్లి.. ఆపన్నహస్తం కోసం నిరుపేద కుటుంబం వేడుకోలు

## సర్జరీకి రూ.10--15 లక్షలు అవసరం.. దాతల సాయం కోసం కుమారుడి కన్నీటి వేడుకోలు





NIZAM'S INSTITUTE OF MEDICAL SCIENCES
(A UNIVERSITY ESTABLISHED UNDER STATE ACT)

040-23489000 / 9244 - 040 - 23395552
Fax 040-23310076
Punjagutta, Hyderabad - 500082, Telangana
www.nims.edu.in

ESTIMATION CERTIFICATE

Lr No.NIMS/26090679/2

Dt: 09-09-2026

This is to certify that Sri/Smt./Kum. SHAIK BEGAM, aged 60/F years, Son/Wife/Daughter of Baji, R/o. 1-13sattupallysattupally, Mobile Number 6303166101, Aadhar No: 517339405527, CR Number 331012601447493, IP NUMBER -, assessed by the Interventional Radiology Dept. Patient has been diagnosed with PARTIALLY THROMBOSED WIDE NECKED SACCULAR ANEURYSM OF PROXIMAL SEGMENT OF BASILAR ARTERY, and advised to undergo STENT ASSISTED COILING.

The approximate expenditure for the above Treatment / Operation at Nizam's Institute of Medical Sciences(NIMS), Punjagutta, Hyderabad, Telangana is as follows:

| Sl. No | Particulars | Amount |
|---|---|---|
| 1 | Hospital Bed Charges | 1,00,000 |
| 2 | Investigation Charges | 25,000 |
| 3 | Drugs & Disposables | 25,000 |
| 4 | Surgery/Procedure Charges | 50,000 |
| 5 | Implant Charges | 8,50,731 |
| 6 | Professional Charges | 5,000 |
| 7 | Miscellaneous | 269 |
| Rupees Ten Lakh Fifty Six Thousand Only | Total Amount | 10,56,000 |

The above treatment is covered under Aarogyasri packages but estimation is issued for the following reason:

EXCEEDS ARSR PACKAGE AMOUNT

Prepared By

Dr.RAMMURTI SUSARLA
Senior Professor
Interventional Radiology
09-Sep-2026 13:03:49

Approved By

Dr.Narimeti Rakesh
Assistant Professor
Hospital Administration
09-Sep-2026 13:15:07

This Certificate is generated through secure login credentials of Concerned Department Doctors through www.nims.edu.in website portal and does not require any physical signature or Institutional st...

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 10** :కన్నతల్లి ప్రాణాలను కాపాడుకునేందుకు ఆ కుమారుడు పడుతున్న ఆరాటం హృదయాలను కలచివేస్తోంది. బ్రెయిన్ ట్యూమర్‌తో తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని కాపాడుకునేందుకు ఓ నిరుపేద కుటుంబం దయగల దాతల కోసం ఎదురుచూస్తోంది.

సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ బేగం పది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వైద్య పరీక్షల్లో బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, ఆలస్యం జరిగితే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సర్జరీతో పాటు తదుపరి వైద్య చికిత్సలకు సుమారు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇప్పటికే చికిత్స కోసం సుమారు రూ. 2 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో కుమారుడు

షేక్ బేగం కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. ఆమె కుమారుడు షేక్ రెహమాన్ డిష్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన రెహమాన్‌కు ఇప్పుడు తల్లికి వచ్చిన ప్రాణాంతక వ్యాధి చికిత్స కోసం లక్షల రూపాయలు అవసరం కావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

"నా తల్లిని ఎలాగైనా బతికించుకోవాలి.. కానీ సర్జరీకి అవసరమైన అంత పెద్ద మొత్తాన్ని నేను ఒంటరిగా సమకూర్చుకోలేను. దయగల దాతలు ముందుకు వచ్చి తమకు తోచినంత సాయం చేసి నా తల్లిని కాపాడాలి" అంటూ రెహమాన్ కన్నీటి పర్యంతమయ్యారు.

తల్లి ప్రాణాలను కాపాడుకునేందుకు తన శక్తిమేర ప్రయత్నిస్తున్నానని, అయితే ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మొత్తంలో చేసే సహాయం కూడా తమ కుటుంబానికి ఎంతో పెద్ద అండగా నిలుస్తుందని తెలిపారు.

మీ చిన్న సాయం.. ఓ తల్లి ప్రాణానికి పెద్ద అండ

మానవతావాదులు, దాతలు షేక్ బేగం పరిస్థితిని అర్థం చేసుకుని తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు అందించే ప్రతి రూపాయి ఆమె శస్త్రచికిత్స, వైద్య చికిత్సకు ఉపయోగపడుతుందని తెలిపారు.

ఆర్థిక సహాయం అందించేందుకు:

పేరు: షేక్ రెహమాన్

ఫోన్‌పే: 97017 07178

"మీ చిన్న సహాయం.. ఓ తల్లి ప్రాణాన్ని నిలబెట్టే పెద్ద ఆశగా మారవచ్చు. దయచేసి ముందుకు వచ్చి ఆదుకోండి" అని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

# అసెంబ్లీలో స్పీకర్ కు జరిగిన అవమానం యావత్తు ఎస్సీ. ఎస్టీ . బీ.సీ. మైనారిటీ కులాలకు జరిగినట్లే

## ఎస్సీ. ఎస్టీ. బీ.సీ. మైనారిటీ. స్టేట్ ప్రెసిడెంట్ ఎం. ఏ . ఖదీర్

హైద్రాబాద్ సెప్టెంబర్ 10:అసెంబ్లీలో స్పీకర్ కు జరిగినటువంటి అవమానం యావత్తు ఎస్సీ. ఎస్టీ . బీ.సీ. మైనారిటీ కులాలకు జరిగినట్లే నని ఎస్సీ. ఎస్టీ. బీ.సీ. మైనారిటీ. స్టేట్ ప్రెసిడెంట్ ఎం. ఏ . ఖదీర్ అన్నారు.ప్రజలచే ఎన్నుకోబడినటువంటి ప్రజా నాయకులు ఒకరికి ఒకరు దూషించుకుంటూ అసెంబ్లీ ముందల చొక్కా లను విప్పుతూ ఒకరిని ఒకరు దోబూచులాడుకుంటూ ప్రజల ముందు హేళన చేయడం సమంజసమైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇది ప్రజా నాయకుల లక్షణాలు కావు ప్రజా నాయకుడు అంటే ప్రజల యొక్క సమస్యలను తెలుసుకుంటూ వాళ్ల సమస్యలను తీర్చడమే ప్రజా నాయకుల లక్ష్యం అంతేకానీ ప్రజల ముందు బూతు మాటలు మాట్లాడుకుంటూ హేళన చేయడం ఇది సోషనీయమైన అంశం కాదు కాబట్టి ఎన్నో ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి ప్రభుత్వాలు ఎవరు వచ్చినా వాళ్ళ యొక్క ప్రభుత్వం నడిచేటప్పుడు ప్రతి నాయకుడు ప్రభుత్వాన్ని సహకరించి ప్రజా నాయకుడు ప్రజల యొక్క సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు తీసుకుంటూ వాళ్ల వాళ్ల నియోజకవర్గాలలో ఉన్నటువంటి సమస్యలను తీర్చడమే ప్రజా నాయ కుడి లక్ష్యం అంతే తప్ప ప్రభుత్వాన్ని విమర్శించడం ఇది మంచి పరిమాణం కాదని ఖదీర్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఎవరైనా ఉంటే దాన్ని గౌరవించడం మన లక్ష్యం తప్ప



కించపరచడం కాదు ప్రభుత్వాలు నడిపే మీరే ఒకరిని ఒకరు దూషించుకుంటుంటే ప్రజా పాలన ఎటు పోతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుంది కాబట్టి ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని సహకరిస్తూ ఒకరిని ఒకరు అర్థం చేసుకొని ప్రజల యొక్క సమస్యలను తీర్చడమే ప్రజా నాయకుల యొక్క లక్ష్యం.

కాబట్టి మేము కోరుకునేది ఒకటే ఎవరి ప్రభుత్వం ఏర్పడిన ఆ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నాయకులు సహకరిస్తూ ప్రభుత్వాన్ని ముందుకు నడిపించాలి తప్ప మీరు ఇచ్చిన హామీలు ఎన్ని ఇచ్చిన హామీలను నెరవేరుస్తలేరు నీకు ప్రభుత్వాన్ని నడపడం చేతకాదు అనే అంశాలు

ప్రజా నాయకులు చెప్పే పద్ధతి కాదు. అందరూ అసెంబ్లీలో కూర్చొని ప్రజల యొక్క సమస్యలను ఒకరిని ఒకరు అర్థం చేసుకుని ప్రజలకు న్యాయం చేయడమే సమంజసమైన పద్ధతి అని ఖదీర్ పేర్కొన్నారు.

అంతేకాకుండా ఏ ప్రభుత్వం వచ్చినా కూడా ప్రజలకు మభ్యపెడుతూ తన మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి హామీలను నెరవేరుస్తాము అని చెప్పడం జరుగుతుంది తప్ప పూర్తిగా నెరవేర్చలేక పోతారు ఎందుకంటే ఇది ప్రజాస్వామ్యం కావున ఇచ్చిన హామీలు అన్నీ కూడా నెరవేర్చడం చాలా కష్టమైనది ఈరోజు యావత్తు తెలంగాణ ప్రజలు ప్రజా పాలన ఎలా జరుగుతుందని చూస్తున్నారు ప్రజా నాయకులు ఒకరినొకరు తమ పదవుల కోసం పోరాడమే తప్ప ప్రజల యొక్క సమస్యలను తీర్చడం గురించి ఆలోచించడం లేదు ప్రజా నాయకులు అందరూ కలిసి ఒకరిని ఒకరు సహకరించుకుంటూ తమదైన శైలిలో ఇతర రాష్ట్రాలలో పరిపాలన ఏ విధంగా జరుగుతుంది మన రాష్ట్రంలో పరిపాలన ఏవిధంగా జరపాలి ఏ విధంగా డెవలప్ చేయాలి ఏ విధంగా ముందుకు సాగితే మన తెలంగాణ బాగుపడుతుంది అనే కోణంలో ఆలోచించి ప్రభుత్వం మరియు ప్రతిపక్ష నాయకులు ఒకరిని ఒకరు అర్థం చేసుకొని తమ తమ నియోజకవర్గాలలో మంచి పరిపాలన ఇవ్వడమే కాకుండా గ్రామ గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను తీర్చినప్పుడే నిజమైన పరిపాలనకు నాంది

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ ఎండీ. ఖాసీం

పిడుగురాళ్ల మండల విద్యాశాఖాధికారి ఎండీ. ఖాసీం పిడుగురాళ్ల మండలంలోని కరాలపాడులో గల మండల ప్రాథమిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరాలపాడు లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లోని అందరూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి అసెంబ్లీకి హాజరు కావడంతో పాటు విద్యార్థులందరూ కూడా ఏకరూప దుస్తులతో సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరు కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఎండి అభినందించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు అందరూ మూడవ తరగతి నుండి విద్యార్థులకు హిందీ బోధించడంతో పాటు కాలిగ్రఫీ దస్తూరి ద్వారా నోటు పుస్తకాలు వ్రాయించటం, అంతేకాకుండా మూడో తరగతి నుండి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి అందరికీ బహుమతులు అందించడం, పాఠశాల అనంతరం కూడా ఒక గంట అదనంగా ప్రధానోపాధ్యాయులు కే. కొండయ్య చొరవ చూపి ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం పట్ల ప్రధానోపాధ్యాయులు కె. కొండయ్య మరియు ఉపాధ్యాయులు జి. పోతిరెడ్డి, వై శ్రీనివాసరావు, రేపల్లె సునంద, అనగాని మనీషా లను ఖాసీం అభినందించారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి...

**తక్కువ వర్షపాతం నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి...**

**చెరువుల్లో ముందస్తుగా నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేయాలి...**

**మండపాలకు ఉచిత విద్యుత్తు..**

**పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం...**

**సమీక్ష సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే నాయిని కీలక సూచనలు..**

**హనుమకొండ ప్రజాబలం ప్రతినిధి** IDOC,హనుమకొండ జిల్లా.వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. తక్కువ వర్షపాతం కారణంగా ఈసారి నగరంలోని చెరువులు, నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

వినాయక చవితి వేడుకల నిర్వహణపై హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ హాల్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై వివిధ శాఖల అధికారులతో నిమజ్జన ఏర్పాట్లు, నీటి వసతి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు.

ఈ ఏడాది గతంతో పోలిస్తే వర్షపాతం తక్కువగా నమోదైనందున నిమజ్జన కార్యక్రమంపై ముందుగానే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ అధికారులు వేగంగా స్పందించి నిమజ్జనానికి అనువైన చెరువులు, నీటి వనరులను గుర్తించాలని సూచించారు.

నీటి మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిమజ్జనానికి అనువుగా నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేపట్టాలని, అవసరమైన చోట్ల నిమజ్జన పాండ్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. భారీ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా క్రేన్లు, ఇతర అవసరమైన పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

బంధం చెరువులో గుర్రపు డెక్క, పూడికతీత పనులను అధికారులు మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు. నిమజ్జనానికి ముందు చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయాలని సూచించారు.

చెరువుల పునరుద్ధరణ పనులను కేవలం వినాయక నిమజ్జనానికే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. రానున్న బతుకమ్మ వేడుకలను కూడా దృష్టిలో పెట్టుకుని చెరువుల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, నీటి లభ్యత వంటి అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

నగరంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు ఉచిత విద్యుత్తు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. మండపాల వద్ద విద్యుత్తు కనెక్షన్లు, వైరింగ్ తదితర అంశాలను సంబంధిత అధికారులు ముందుగానే పరిశీలించాలని, ఎలాంటి విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ ఏడాది నగరంలో గతం కంటే ఎక్కువ సంఖ్యలో వినాయక మండపాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉన్నందున, వాటి వివరాలను ముందుగానే సేకరించి సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు.

వినాయక మండపాల పరిసర ప్రాంతాల్లో ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. చెత్త తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

మండపాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.




వినాయక మండపాల సమీపంలో ఆలయం, పాఠశాల, చర్చి, మసీదు వంటి మతపరమైన, విద్యాసంస్థలు ఉంటే నిర్వాహకులకు ముందుగానే అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. శబ్ద వ్యవస్థ వినియోగంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా వేడుకలు నిర్వహించేలా నిర్వాహకులతో అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అన్ని వర్గాల సహకారంతో వినాయక వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడటం అధికారుల బాధ్యత అని నాయిని పేర్కొన్నారు.

వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్, ట్రాఫిక్, జీడబ్ల్యూఎంసీ, విద్యుత్తు, ఆరోగ్య, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందుగానే రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని, నిమజ్జన మార్గాల్లో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి సంవత్సరం పండుగలు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో చివరి నిమిషంలో ఏర్పాట్లు చేయకుండా ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని అధికారులకు హితవు పలికారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అవసరమైన వనరులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో EV శ్రీనివాస్ రావు,మాజీ కార్పొరేటర్ అబూబకర్,అదనపు కలెక్టర్ రవి, GWMC, టౌన్‌ప్లానింగ్, పోలీస్, విద్యుత్తు, ఆరోగ్య, ట్రాఫిక్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు



జహీరాబాద్, సెప్టెంబర్ 10 ప్రజాబలం ప్రతినిధి: విద్యార్థుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థపై ప్రభావం చూపే GO నంబర్ 97ను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ సంఘం నాయకులు ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్‌తో పాటు నాయకులు ఓంకార్, ఫయాజ్ తదితరులను పోలీసులు రాత్రికి రాత్రే అదుపులోకి తీసుకుని జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నిస్తున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు.

ఎన్ని అరెస్టులు చేసినా, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. +ూ నంబర్ 97ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఖడే హనుమాన్ జీ ఆలయం, ఉజ్జయిన్ – విశ్వాసం మరియు శక్తికి ప్రతీక



భారతదేశంలోని అత్యంత ప్రాచీన, పవిత్ర నగరాల్లో ఒకటైన మధ్య ప్రదేశ్ లోని ఉజ్జయిన్ నగరంలో శ్రీ మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ దేవస్థానం తో బాటు అనేక ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నిలయం. వాటిలో విశిష్టమైనది ఖడే హనుమాన్ దేవాలయం. ఇతర ప్రాంతాల్లో సాధారణంగా కూర్చున్న, మోకాళ్లపై ఉన్న లేదా ఆకాశంలో ఎగురుతున్న భంగిమల్లో దర్శనమిచ్చే హనుమంతునికి భిన్నంగా, ఇక్కడ నిలబడి ఉన్న భంగిమలో హనుమంతుడు దర్శనమిస్తారు. ఈ ఆలయం సుమారు 170 సంవత్సరాల పురాతనమైనదిగా, సుమారు 1857 కాలానికి చెందినదిగా స్థానిక సంప్రదాయాలు పేర్కొంటాయి. తరతరాలుగా ఇది పాత ఉజ్జయిన్ లో ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా భక్తుల విశ్వాసాన్ని చూరగొంది.

సుమారు 8 అడుగుల ఎత్తైన హనుమంతుని విగ్రహం ప్రకాశవంతమైన సింధూరం, అందమైన కిరీటం, పవిత్రమైన తిలకం, అలంకృత వస్త్రాలతో భక్తులను ఆకట్టుకుంటుంది. ఈ విగ్రహం శక్తి, ధైర్యం, రక్షణ మరియు అచంచలమైన భక్తికి ప్రతీకగా భావించబడుతుంది. స్థానిక భక్తులు ప్రేమగా హనుమంతుడిని "డాక్టర్ హనుమాన్" అని కూడా పిలుస్తారు. ఈ ఆలయంలో ప్రార్థనలు చేయడం ద్వారా అనారోగ్యంతో ఉన్న పిల్లలకు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఉపశమనం లభిస్తుందనే విశ్వాసం చాలాకాలంగా ఉంది.

కదలని హనుమంతుని విగ్రహం

సింహస్థ కుంభమేళా 2028 ఏర్పాట్లలో భాగంగా ఈ దేవాలయం ఇటీవల దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది. కాంతల్ నుంచి ఛత్రి చౌక్ వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆలయ పరిసర నిర్మాణాన్ని ప్రభుత్వ అధికారులు తొలగించారు. అయితే భారీ యంత్రాలను ఉపయోగించి సుమారు 8 అడుగుల ఎత్తైన హనుమంతుని విగ్రహాన్ని తరలించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ, దాదాపు 40 గంటల పాటు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు.

అధికారులు, నిపుణులు దీనిని ఇంజినీరింగ్ మరియు నిర్మాణపరమైన సవాలుగా భావిస్తూ, విగ్రహం మరియు దాని పునాదిని జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. అయితే భక్తులు మాత్రం విగ్రహం కదలకుండా అక్కడే నిలిచిపోవడాన్ని దైవ సంకేతంగా భావిస్తున్నారు. ఇది హనుమంతుని అపారమైన శక్తి, సంకల్పానికి ప్రతిబింబమని వారు విశ్వసిస్తున్నారు.

ఖడే హనుమాన్ జీ ఆలయ కథ విశ్వాసం, వారసత్వం మరియు ఉజ్జయిన్ ఆధ్యాత్మిక సంప్రదాయాల మధ్య ఉన్న చిరస్థాయి అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. మహత్తరమైన సింహస్థ 2028కు ఉజ్జయిని సిద్ధమవుతున్న వేళ, అచంచలంగా నిలిచిన ఖడే హనుమాన్ జీ మరోసారి భక్తి, విశ్వాసానికి శక్తివంతమైన ప్రతీకగా నిలిచారు.

"విశ్వాసం అచంచలంగా నిలిచిన చోట, దైవశక్తి కూడా ఎన్నటికీ కదలదు".

--- కైలాస్ నాగేష్ 9849052956

# నోటీసులు అందుకున్న ఓటర్లు భయపడొద్దు: తహసిల్దార్ దశరథ్



**జహీరాబాద్, సెప్టెంబర్ 10 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జహీరాబాద్ తహసీల్దార్ దశరథ్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. నోటీసులు అందుకున్న వారు తమకు సూచించిన విధంగా తగిన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని దశరథ్ కోరారు.

## సమాధానం చెప్పలేక సస్పెండ్ చేస్తున్నారు: హరీష్‌రావు

హైదరాబాద్ ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు బీఆర్ఎస్ నేత హరీష్‌రావు. సమాధానం చెప్పలేకే తమను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా 30 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. సర్టిఫికెట్లు అందక ఉద్యోగ, విదేశీ విద్య అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

# పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ: డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్.

## బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయం..



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 10:**అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో గురువారం ఘనంగా నివాళు లర్పించారు.

పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సత్తుపల్లి--వేంసూర్ రోడ్డులోని ధోబీఘాట్‌లో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయాన్ని ఎదిరించి, ఆత్మగౌరవం కోసం పోరాడిన చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, పోరాట పటిమ తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనందబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, సత్తుపల్లి రజక సంఘం అధ్యక్షులు విరివాడ నాగభూషణం, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులు ఖండనీయం..

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. ప్రజల గొంతును నొక్కలేరు

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 10 :** హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడి, నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను తెల్లవారుజాము నుంచే ఇళ్ల వద్ద హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది.



ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కని పేర్కొంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్ట్‌లతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని.. హౌస్ అరెస్ట్‌లతో ప్రజల గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులపై విధించిన అక్రమ నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు బకాయిలు చెల్లించాలి




**జహీరాబాద్, సెప్టెంబర్ 10 ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య, వాటర్ సప్లై, ఎలక్ట్రిషియన్ కార్మికులకు ఆరు నెలల పీఎఫ్ బకాయిలు, మే నెల వేతనాన్ని వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కే. నర్సిములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ డీఈ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్ సొమ్ము మినహాయిస్తున్నప్పటికీ సంబంధిత సంస్థలకు జమ చేయడం లేదన్నారు. ప్రమాదాల సమయంలో ఉపయోగపడే ఈఎస్ఐ కార్డులు, ఐడీ కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. విలీన గ్రామాల్లో గతంలో పనిచేసిన కార్మికులకు రెండేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, ఎం. నర్సింలు, సురేష్, గౌస్ సలీం, వీరారెడ్డి, దత్తురెడ్డి, మారుతి, లాలయ్య, రాజు, రవి, నర్సింలు, సిద్ధన్న, శంకర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం




**జహీరాబాద్, సెప్టెంబరు 10 ప్రజా బలం ప్రతినిధి:** అణచివేతకు ఎదురొడ్డి ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం, నిబద్ధత నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ఐలమ్మ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, ఎఫ్ఎంసీఎస్ చైర్మన్ సత్యం ముదిరాజ్, సర్పంచ్ దాసరి మచ్చేందర్, రాజేందర్‌రెడ్డి, మూర్తుజా, నిజాం, శివకుమార్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు రాకేష్, ఫయాజ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బతింటున్న భూసారం

## రసాయన ఎరువులతో పొంచి ఉన్న ప్రమాదం

## దెబ్బతింటున్న ప్రజా ఆరోగ్యం

## జాగ్రత్తలు పాటించని రైతులు

**చంద్రుగొండ సెప్టెంబర్ 10 ప్రజబలం ప్రతినిధి బ :**-సాగులో చీడపీడల తెగుళ్ల సమస్యను అధికమించేందుకు పలు మార్గాలు ఉన్నా రసాయన మందులపై రైతులు ఆధారపడక పరిస్థితులు తప్పడం లేదు. వ్యవసాయ రంగంలో చీడపీడలు బెడద పెరుగుతుంది. వాటి నియంత్ర ణకు పురుగుమందులు విచ్చలవిడిగా వాడుతుండటంతో తీరని నష్టం కలుగుతుంది విష ప్రభావంతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు ఆహార పదార్థములు కలుషితమవుతున్నాయి. దేశంలో అత్యంత





ప్రమాదకర పురుగు మందులు వాడటం యాట యాట పెరుగుతుంది. పిచికారి సమయంలో అజాగ్రత్తలు వల్ల దేశంలో యాట వేల లో రైతులు ప్రాణాలు పోతున్నాయని, జాతీయ నేర గణాంకాల సంఖ్య నివేదిక పేర్కొంది. పురుగు మందు ఉత్పత్తిలో భారత్ మార్కెట్లో ఏటా ఏటా విస్తరిస్తుంది. పురుగు మందుల వినియోగంలో ప్రపంచం లోనే మన దేశం నాలుగో స్థానానికి ఏకబాకింది. పురుగుమందులను మన దేశంలో పంజాబ్, హర్యానా అత్యధికంగా వినియోగిస్తున్నాయి. ఆ తర్వాత స్థానాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వాడుతున్నారు నకిలీ బీటీ పత్తి సాగు ఎక్కువ, దీనివల్ల పంటను రసం పీల్చే కాయ, తొలుచే పురుగు ఆశిస్తుంది. మిరపపై హైబ్రిటీ వరి రకాలను చీడపీడలు దెబ్బతీస్తున్నాయి వీటిని తట్టుకునేందుకు రైతులు శాస్త్రీయ ప్రయోగాలు చేస్తున్నారు. మూడు నాలుగు మందులు మిశ్రమాన్ని పిచికారి చేస్తున్నారు మోతాదుకు మించి వాడుతున్నారు. తెగుళ్ల పురుగులు నియంత్రణలోకి రావడం లేదు. పైగా కొత్త రకం తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. పల్లెల్లో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుంది. పంట పొలాల్లో కలుపుతీతకు గడ్డి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు దీంతో రైతులు కలుపు మందు పై ఆధారపడుతున్నారు. ఇది కూడా అత్యంత విషపూరితమైనవి. భూమి లేని కూలీలకు పిచికారి ప్రక్రియ ఉపాధి మార్గమైంది కానీ వారిలో 80 శాతం మందికి కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. ఎలాంటి రక్షణ లేకుండా పిచ్చికారిచేస్తారు చాలామంది గాలికి వ్యతిరేక దశలో పిచికారి చేయటం శక్తివంతమైన విదేశీ తైవాన్ స్ప్రేర్స్ వినియోగిస్తుండటంతో మశీదు నీటి తుంపర్లు శరీరాన్ని తడిసి ముద్ద చేస్తున్నాయి. నోరు ముక్కు చర్మం ద్వారా చేరుతున్నవి విషపూరిత రసాయనాలు అవయవాలు పనితీరును దెబ్బతీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. పొలాల్లో పనిచేసే మహిళలపై ఈ విష ప్రభావం కనిపిస్తుంది. వారిలో సంతానంలేమి గర్భ విస్తీతం అంటే సమస్యలు తలెత్తుతున్నాయి పంటలపై పిచికారి చేసే ముందు రక్షిత పురుగుల్ని తాకేది కేవలం 0-01 శాతమేనని దశాబ్దక తమే శాస్త్రవేత్తలు గుర్తించారు. విచ్చలవిడిగా వాడటం వల్ల లక్షల ఎకరాల్లో నేల సారాన్ని కోల్పోతుంది. రసాయనాల అవశేషాలతో మనం తినే అన్నం కూరగాయలు పండ్లు పప్పు ధాన్యాలు విషం గా మారుతున్నాయి. ఈ సమస్యకు సమగ్ర సత్సరక్షణ పద్ధతులే సరైన పరిష్కారాలు మార్గాలుగా స్థానిక సేద్య విధానాలను అన్నదాతలు అవలంబించడం శ్రేయదాయకరం. హాని చేయని పర్యావరణ పరిరక్షణకు రసాయన బయోపిక్ స్టేట్ తయారుచేసిగా కంపెనీలు, ప్రభుత్వాలు, ప్రోత్సహించాలి. ఒక "ఎకరానికి పెట్టే పెట్టుబడులు రైతులు నాలుగు వంతు పురుగుమందులకే విచ్చిస్తున్నారని అంచనా, సేంద్రియ సాగుతో రైతులకు ఈ భారం తప్పుతుంది ఎలా అంటే పర్యావరణ విధానాలను మరింత చేరువ చేయాలి. ఈ బాధ్యత వ్యవసాయ విస్తరణ అధికారులదే తక్కువ ధర ఆశ చూపి అంటగడుతున్న నకిలీ నిషేధ ఉత్పత్తులని ఎన్నో ఉన్నాయి. క్రిమిసంహారక ప్రెస్టేజ్ మేనేజ్మెంట్ పెట్టేలా నిబంధనలను మరింత పదును పెట్టాలి. అప్పుడే సాగు రంగంతో పాటు ప్రజా ఆరోగ్యం సురక్షితం అవుతుంది.

# రైతుల విషయంలో రాజకీయాలు చేస్తే సహించం

## భోజన విరామ సమయంలో ఫోటోలు తీసి సోషల్ మీడియాలో

## న్యూస్ పేపర్లో పెట్టడం సిగ్గుచేటు

## విలేకరుల సమావేశంలో సొసైటీ చైర్మన్ దిరిశాల



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 10:**తమ స్వార్థ రాజకీయాల కోసం కలకోడిమ సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు అంటూ సోషల్ మీడియాలో మరియు న్యూస్ పేపర్లో తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటు అని కలకోడిమా సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముగ్గురు సొసైటీ సిబ్బంది 115 మంది రైతులకు 620 యూరియా బస్తాలను పంపిణీ చేసి, విరామ సమయంలో భోజనానికి వెళ్లి 1.20 నిమిషాలకు తిరిగి వచ్చేసరికి కొంతమంది కావాలనే రాజకీయ దురుద్దేశంతో ఫోటోలు తీసి తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. మంగళవారం మొత్తం 179 మంది రైతులకు 1046 యూరియా బస్తాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా సొసైటీ లో సీసీ కెమెరా సౌకర్యం ఉందని,ఎవరికైనా తన వివరణ పై అనుమానం ఉంటే సిసి ఫుటేజ్ చెక్ చేసుకోవచ్చు అని బహిరంగ సవాల్ విసిరారు. అయినా కేంద్ర ప్రభుత్వం యాప్ ప్రవేశపెట్టిన వద్ద నుండి రాష్ట్రంలోని కాదు దేశంలో ఎక్కడ కూడా రైతులు క్యూ లైన్లో నిల్చున్న దాఖలాలు లేవని ఆయన గుర్తు చేశారు. రైతుల విషయంలో ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన ఈ సందర్భంగా కలకోడిమా సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు హెచ్చరించారు.

# చింతల్ కుంట దగ్గర ప్రమాదం..

## తప్పిన ప్రాణ నష్టం

హైదరాబాద్ఎల్బీనగర్ చింతలకుంట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న విజయవాడ ఆర్టీసీ బస్సును కియా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. ఎయిర్బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రాణనష్టం తప్పింది. డోర్లు లాక్ కావడంతో కారులో ఉన్న వ్యక్తులు కొంతసేపు ఆందోళనకు గురైనట్లు సమాచారం. కారులో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉన్నట్లు సమాచారం. ఓ రాజకీయ నాయకుడు పుట్టినరోజు వేడుకలకు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం. డ్రైవర్ మద్యం సేవించి ఉన్నారనే ఆరోపణలు వచ్చాయి. ప్రమాదానికి అసలు కారణాలపై ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది...

# ఎవరు అర్హులు? ఎవరు అనర్హులు?

# 786 దరఖాస్తులపై పరిశీలన

## చేయూత పెన్షన్లపై సర్కార్ ఫోకస్.. గ్రామాల వారీగా వెరిఫికేషన్

## ఆరుగురు అధికారులతో నేటి నుండి గ్రామాల వారీగా వెరిఫికేషన్: ఎంపీడీవో శాంతమ్మ

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 10(ప్రజాబలం)మర్పల్లి, వికారాబాద్ జిల్లా**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ ఇచ్చేందుకు దరఖాస్తులకు కోరగా మండలంలో చేయూత పెన్షన్ల కోసం మొత్తం 786 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు ఆరుగురు అధికారులతో ప్రత్యేక వెరిఫికేషన్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక్కో అధికారికి ఐదు గ్రామాల చొప్పున బాధ్యతలు అప్పగించామని శుక్రవారం నుండి వెరిఫికేషన్ కోసం గ్రామాలకు అధికారులు రానున్నారని పేర్కొన్నారు. మండలంలో వితంతు పెన్షన్లకు 565, ఒంటరి మహిళలకు 76, వికలాంగుల పెన్షన్లకు 128, చేనేత కార్మికులకు 4, గీత కార్మికుల పెన్షన్లకు 13 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హత, దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేపడుతున్నట్లు చెప్పారు. వెరిఫికేషన్ బాధ్యతలను మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్కు బిల్కల్, షాపూర్, మర్పల్లి గ్రామాలు; హౌసింగ్ ఏఈ మనోహర్కు కొత్లపూర్, సిరిపురం, వీర్లపల్లి, కోటమర్పల్లి, కుదుగుంట గ్రామాలు; పంచాయతీరాజ్ ఏఈ నరేందర్కు



మల్లికార్జునగిరి, దారుగులపల్లి, పిలిగుండ్ల, కోమషేట్పల్లి గ్రామాలు; మండల విద్యాధికారి బి అశోక్కు మొగిలిగుండ్ల, జంషెడ్పూర్, రాంపూర్, ఘనాపూర్ గ్రామాలు; మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్కు పట్లూర్, నర్సాపూర్ పెద్దతండా, పంచలింగాల, నర్సాపూర్, పెద్దాపూర్ గ్రామాలు కేటాయించారు. ఉప తహసీల్దార్ పరశురాంకు కల్కోడ, బుచ్చన్పల్లి, దామస్తాపూర్, గుర్రంగట్టుతండా, రావులపల్లి, తుమ్మలపల్లి, తిమ్మాపూర్ గ్రామాల బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు. వెరిఫికేషన్ కోసం అధికారులు గ్రామాలకు వచ్చిన సమయంలో సంబంధిత దరఖాస్తుదారులు పెన్షన్కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సిద్ధంగా జత చేకోవాలని ఎంపీడీవో సూచించారు.

# ఘనంగా వుండ్రు శ్యాంబాబు వరలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం

## 20 వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు అజయ్ బాబు పుట్టినరోజు వేడుకలు

## పలు సేవ కార్యక్రమాలు..

**ఖమ్మం జిల్లా బ్యూరో సెప్టెంబర్ 10 ప్రజాబలం:**లయన్స్ క్లబ్ అఫ్ వైరా, గ్రేట్ విజన్,అవని మరియు 20 వ వార్డ్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా జి ఇ టీ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు వరలక్ష్మి దంపతుల పెళ్లిరోజు మరియు వారి కుమారుడు అజయ్ బాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు .అనంతరం కేక్ కటింగ్ చేసి లయన్స్ సభ్యులు మిత్రులు శ్రేయోభిలాషలు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళి కృష్ణ రాంబాబు కొదుమూరి రవి వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి శ్రీనివాసరావు సభ్యులు మరికంటి రాంగోపాల్ దాస్ సంగిశెట్టి వెంకటేశ్వర్లు స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి







మాట్లాడుతూ ప్రతి లయన్ మెంబెర్ తమ తమ పుట్టినరోజు లు పెళ్లి రోజు లో సేవా కార్యాక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మనిషి సేవాభావం పెంపొందించుకోవాలని సమాజ సేవకు పాటుపడాలని ఆయన సూచించారు ఈరోజు పలు సేవకార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్యామ్ బాబు దంపతులను అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు.

లి శాంతి నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ ,మరియు షూస్ అందజేశారు.

లి పేద విద్యార్థినికి సైకిల్ అందజేశారు

లి వృద్దులకు దుప్పట్ల పంపిణి చేసారు

ఈ కార్యక్రమం లో జిల్లా ఎల్సిఐఎఫ్ఐ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు రీజన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావ్ జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్ రీజియన్ సెక్రటరీ వై బుచ్చి రామారావు లయన్స్ క్లబ్ అధ్యక్షు కార్యదర్శులు కొల్లా టీచర్ కరుణశ్రీ బిఖ్య సేవాలాల్ అధ్యక్షులు నరసింహా నాయక్ జిల్లా కమిటీ సభ్యులు నూకల ప్రసాదరావు చింతోజు నాగేశ్వరరావు చింతలపూడి వెంకటేశ్వరరావు అవని క్లబ్ అధ్యక్షులు గద్దె నీరజ సెక్రటరీ సుగ్గల మాధవి సభ్యులు పోలా శ్రీనివాసరావు నాళ్ల నాగమల్లేశ్వరి రాయల విజయలక్ష్మి పొదిలి కల్పన సునీత శైలజపువ్వాళ రాము బిఖ్య క్లబ్ ల సభ్యులు వార్డు ప్రజలు, మిత్రులు స్కూల్ హెడ్ మాస్టర్ టీచర్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరకు అమ్మిన వాటర్ బాటిలు..రూ.7 లక్షలు ఫైన్

అన్నవరం దేవస్థానంలో రూ.18 ఎమ్మార్పీ ఉన్న వాటర్ బాటిల్ను రూ.25కు విక్రయించినదుకాణదారుడికి జిల్లా వినియోగదారుల కమిషన్ రూ.7లక్షల భారీ జరిమానా విధించింది.పిఠాపురానికి చెందిన డి.వెంకటేశ్వరరావు ఫిర్యాదుపై విచారించిన కమిషన్ ఈ మేరకు తీర్పునిచ్చింది.బాటిల్ అదనపు ధరకు తోడు ఫిర్యాదుదారునికి రూ.10 వేల పరిహారం, కేసు ఖర్చులకు రూ.5 వేలు, వినియోగదారుల సంక్షేమ నిధికి రూ.7 లక్షలు 45 రోజుల్లోగా చెల్లించాలని దుకాణదారుడిని కోర్ట్ ఆదేశించింది.



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గం ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ హిందినగర్ అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జూబ్లీహిల్స్ శాసన సభ్యులు నవీన్‌యాదవ్ విచ్చేసి అసోసియేషన్ సభ్యులను అబినందిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు సనాతన ధర్మం హిందుసంప్రదాయ బద్దంగా భక్తి శ్రద్దలతో పూజ కార్యక్రమాలను నిర్వహించి తెలంగాణా రాష్ట్రం అభివృద్ధి పదంలో నడవాలని ప్రజల కష్టాలు తీరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అభిమన్యు యూత్ అసోసియేషన్ నిర్వాహకులు కె. తరుణ్ రాజ్, టి. విశాల్ ,బి. వంశీ రాజ్ ,బి. వర్షిత్ రాజ్, మోహిత్ సింగ్ ,నిఖిల్ తదితరులు పాల్గోన్నారు.

# గడిపెద్దాపూర్ గ్రామానికి కొత్త రోడ్డు

## మంత్రి దామోదర్ రాజనర్సింహ,చోరవతో అభివృద్ధి బాటలు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** అందోల్ తాలూకా అల్లాదుర్గం మండలంలోనె పెద్ద గ్రామ పంచాయతీగా, చారిత్రక ప్రాధాన్యత కలిగిన గడిపెద్దాపూర్, గ్రామానికి ఎన్హెచ్ -161, నుంచి ఉన్న ప్రధాన రహదారి గత పదిహేళు ్లగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది, కనీసం రోడ్డుపై ఏర్పడిన గుంతలను కూడా, పూడ్చకపోవడంతో, గ్రామ ప్రజలతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, మాజీ ఎమ్మెల్యే కు చెందిన పక్క గ్రామశీ అయినప్పటికీ అభివృద్ధికి నోచుకోకపోవడం గత పాలకుల వివక్షకు నిదర్శనంగా గ్రామస్తులు పేర్కొంటున్నారు, మంత్రి దామోదర్ రాజనర్సింహ, చోరతో,గడిపెద్దాపూర్ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది, గ్రామ ప్రజల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న మంత్రి తక్షణమే ర, 95,లక్షలు మంజూరు చేశారు చేసి, రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు, ప్రస్తుతం రోడ్డు పనులు 90 శాతం పూర్తి అయ్యాయి, త్వరలో బ్యూటీ పనులు కూడా పూర్తయి, ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి, ఏళ్ల తరబడి ఎదురుచూసిన, తమ గ్రామ రోడ్డు నిర్మాణం, సహకారం కావడంతో గడిపెద్దాపూర్ గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు, "ప్రజల కోరికే ప్రాధాన్యం " మంత్రి దామోదర్ రాజనర్సింహ, నాయకత్వంలో గడి పెద్దాపూర్ అభివృద్ధి పథంలో.....




# ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పీహెచ్డీలు

## ఈర్లపూడి గ్రామానికే గర్వకారణం..
## భూక్యా సుందర్లాల్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 10:** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం, ఈర్లపూడి గ్రామానికి చెందిన బి. సుందర్ లాల్ – శ్రీమతి శైలజ దంపతుల కుమారుడు డా. బి. సృజన్ లాల్ మరియు కుమార్తె డా. జె. మౌనికా జాదవ్ ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పీహెచ్డీలు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.

వీరిద్దరూ ఉస్మానియా విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసి, విశ్వవిద్యాలయ 85వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టాలు అందుకున్నారు.

ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి డాక్టరేట్ సాధించడం వారి పట్టుదలకు, కృషికి, విద్యపై ఉన్న అంకితభావానికి నిదర్శనం. ప్రస్తుతం డా. బి. సృజన్ లాల్ ఎస్బిఐ లో, డా. జె. మౌనికా జాదవ్ టిజీ ఎస్ ఎన్ పిడిసిఎల్ లో విధులు నిర్వహిస్తూనే ఉన్నత విద్యలో రాణించడం యువతకు స్ఫూర్తిదాయకం.

వారి విజయాన్ని తల్లిదండ్రులకు అంకితం చేయడం, విద్యపై సుందర్ లాల్ కి ఉన్న మమకారమే తమ విజయానికి ప్రధాన కారణమని పేర్కొనడం అభినందనీయం.

ఈ సందర్భంగా డా. బి. సృజన్ లాల్ మరియు డా. జె. మౌనికా జాదవ్ దంపతులకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున



హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము. వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజానికి మరియు దేశానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

# 10వ వార్డు సమస్యల పరిష్కారానికి జీఎం హామీ



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 10:** సత్తుపల్లి పట్టణంలోని 10వ వార్డులో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ 10వ వార్డు కౌన్సిలర్ మట్ట దేవజ్యోతి ఆధ్వర్యంలో గురువారం జీఎం కార్యాలయంలో జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.

వార్డులోని కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, ఇళ్ల రిపేర్లుతో పాటు ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను సానుకూలంగా విన్న జీఎం, సంబంధిత అంశాలను పరిశీలించి అడిగిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కరరావు, దొడ్డకుల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# దళితులు మహిళల గౌరవం ఆత్మగౌరవం భద్రతను కాపాడాలని కోరుతూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గౌరవ గవర్నర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** శాసనసభ స్పీకర్ పై, బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన అనుచిత వ్యాఖ్యలు, పోలీసులపై దాడులు, మహిళా పోలీసులతో అనుచిత ప్రవర్తన, దళితులు నడిచిన రహదారులను, పసుపు నీరు మరియు పాలతో శుద్ధి చేయడం, వంటి ఘటనలు, రాజ్యాంగ స్ఫూర్తికి, మానవ విలువలకు విరుద్ధమని, ఉపముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు, దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే ఇలాంటి చర్యలకు పాల్పడిన, ప్రత్యక్ష వ్యక్తులతో పాటు, వాటి వెనుక ఉన్న బీఆర్ఎస్ అగ్రనాయకత్వంపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని,గవర్నర్ ను కోడరినట్లు తెలిపారు, దళితుల గౌరవం సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ, రాజీ పడదని, ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు.....

# సర్ సమగ్ర సవరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో కరుణాకర్.



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్ 10:** తల్లాడ మండలం కోడవటిమెట్ట గ్రామంలోని నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణను కేంద్రాన్ని గురువారం తల్లాడ ఎమ్మార్వో కరుణాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాంలో పేర్లు అడ్రస్ సవరణలు తప్పుగా ఉన్న వారికి వచ్చిన నోటీసులు ఆధారంగా త్వరగా తమ తప్పులను సరి చేసుకుంటు సంబంధిత పత్రాలు తనిఖీ కేంద్రంలో సమర్పించాలని లేకపోతే తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని గ్రామ సర్పంచ్ మోదుగు తిరుమల్ రావు, గ్రామ బి ఎల్ వో కళ్యాణి ,గ్రామ సెక్రెటరీ, సూపర్వైజర్, గ్రామ దీపిక దుర్గా గ్రామ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలో 97జీఓకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన

సికింద్రాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 97జీఓకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. కళాశాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శక్తి వద్దు, జీఓ నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు చరణ్ మాట్లాడుతూ ఎటువంటి చర్చలు, నిర్ణయాలు చేయకుండానే జీఓ నెంబర్ 97ను ప్రభుత్వం తీసుకు వచ్చిందని తెలిపారు. ఈ జీఓ ద్వారా తమను కూలీలుగా మార్చడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ కోసం నిరసన తెలువుతున్న తమను విద్యార్థులగా కాకుండా టెర్రరిస్టులుగా చూస్తూ ఎక్కడిక్కడ పోలీసులు ఏర్పాటు చేసి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం.
## భార్యాభర్తల ఆత్మహత్య.





హైదరాబాద్ లాలాగూడ పరిధిలోని విజయపురి కాలనీలో విషాదం నెలకొంది. భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లో ఉరి వేసుకుని ఒకరు, రైలు కింద పడి మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. ముందుగా విజయపురి కాలనీలో భార్య లక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుంది. నిద్ర లేచి భార్య మృతదేహాన్ని చూసిన భర్త చరణప్ప, భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. లాలాపేట్ రైల్వే బ్రిడ్జి వద్ద రైలు కిందపడి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకేరోజు భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందారు. ఏడాదిన్నర క్రితమే చరణప్ప, లక్ష్మి వివాహం జరిగింది. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. చరణప్ప నాచారంలో ఫుట్పాత్పై టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com